స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com
PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 124 | మంగళవారం, సెప్టెంబర్ 22, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 124 | TUESDAY, SEPTEMBER 22, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |

## సాగునీటి ప్రాజెక్టుల పునరావాసంపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

• జిల్లాలవారీగా భూసేకరణ పురోగతిపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ 2లో..

### నిధులు ఇస్తున్నా.. పనులెందుకు

# జరగడం లేదు ?

## వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులపై ముఖ్యమంత్రి అసంతృప్తి

• వచ్చే 30 రోజుల్లో 24 గంటలపాటు పనులు జరగాలి • వర్క్ షెడ్యూల్ తయారు చేసుకొని ముందుకెళ్లాలని ఆదేశం • సీఎంవో అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో సమీక్ష చేయాలి • ప్రత్యేక అధికారులతో పనులు పర్యవేక్షించాలి • సనత్‌నగర్ టిమ్స్‌లో స్టాఫ్ క్వార్టర్స్ ఏర్పాటు చేయాలి • టిమ్స్ మెయింటెన్స్‌ను ఏజెన్సీకి అప్పగించాలని ఆదేశం • సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్




హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వార్త వేదిక సూర్య):

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయడానికి గ్రీన్ ఛానల్‌లో నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ పనులు జాప్యం జరుగుతుండటంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే 30రోజుల్లో 24గంటలూ పనులు కొనసాగించాలని ఆదేశించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌తో పాటు ఇతర హాస్పిటల్స్‌కు సంబంధించి ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. వరంగల్ హాస్పిటల్ భవన నిర్మాణం పూర్తి చేయడంపై ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పనులకు సంబంధించి షెడ్యూల్ తయారు చేసి అందుకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని చెప్పారు. సీఎంఓ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి పనికి ఒక ప్రత్యేక అధికారికి బాధ్యత అప్పగించాలని, ఇకనుంచి ప్రతిరోజూ ఆసుపత్రి పనులను పర్యవేక్షించాలని కలెక్టర్‌ని ఆదేశించారు. భవన నిర్మాణం విషయంలో శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని, అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆసుపత్రి పరిసరాలు అహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా అవసరమైన విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. సనత్‌నగర్ ఎంసీఆర్ టిమ్స్ తరహాలో వరంగల్ ఆసుపత్రిలో కూడా ఓపీ సేవలు అందుబాటులోకి తేవాలని చెప్పారు. సనత్‌నగర్ టిమ్స్‌లో స్టాఫ్ క్వార్టర్స్‌ను నిర్మించాలని, అందుకు సంబంధించి తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే హాస్పిటల్ నిర్వహణను ఏజెన్సీకి అప్పగించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డితో పాటు వైద్య ఆరోగ్య, రోడ్లు భవనాలు, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఇక నుంచి రైలు నెం.11005 'దాదర్ - పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్' కుప్పంలో ఆగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ మేరకు రైల్వే స్టేషన్లో ప్రయాణికులతో మాట్లాడిన ఆయన పలువురి నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు



కుప్పం అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యాధునిక రైతు బజార్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. కోల్డ్ స్టోరేజీ, వేస్ట్ మేనేజ్‌మెంట్, సోలార్ విద్యుత్ వ్యవస్థలనూ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు

# ఓటుతోనే అభివృద్ధి

• ఎన్నికలొస్తే కుప్పం ప్రజలకు కనిపించేది సైకిలే • నేను అభివృద్ధి, సంక్షేమాన్ని ఇస్తున్నా.. కూటమి అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత మీదే • కుప్పం ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. • మోడల్ నియోజకవర్గంగా కుప్పం! • ఇక్కడ రక్తాభిషేకాలకు చోటు లేదు • బహిరంగ సభలో సీఎం చంద్రబాబు

కుప్పం, సెప్టెంబరు 21 (వార్త వేదిక సూర్య):

'అంతా మంచివాళ్లు ఉన్నది కుప్పమేనని నేను నమ్ముతా. ఎన్నికలొస్తే ఇక్కడి ప్రజలకు కనిపించేది సైకిలే. సైకిలెక్కి ఓట్లు వేస్తారు. నేను అభివృద్ధి, సంక్షేమాన్ని ఇస్తున్నా. కూటమి అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత మాత్రం మీదే' అని కుప్పం ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేటలో సోమవారం ఆయన రూ.38 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, రూ.289 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. అక్కడే జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. 'వైసీపీ అనేది రాజకీయ పార్టీ కాదు. నేరస్తులను ప్రోత్సహించే పార్టీ. హత్యలు, దాడులు చేసే పార్టీ. రేపటి ఎన్నికల్లో వాళ్లు ఒక్క వార్డు మెంబర్ కానీ, కౌన్సిలర్ కానీ గెలవకూడదు. అది గొడ్డలి పార్టీకి మరిచ్చే సమాధానం అవుతుంది. నేను మీ అందరి ఆమోదంతోనే అభ్యర్థులను నిలబెడతాను. గెలిపించుకునే బాధ్యత మీదే' అని చంద్రబాబు అన్నారు. నారావారిపల్లె తనకు జన్మనిస్తే, కుప్పం రాజకీయ జీవితాన్ని ఇచ్చిందని భావోద్వేగంతో అన్నారు. ఒక అన్నగా, తమ్ముడిగా కుప్పం కుటుంబాలలో తానూ ఒక సభ్యుడినేన్నారు. అందువల్ల కుప్పం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదల గురించే నిరంతరం ఆలోచిస్తుంటానన్నారు. కుప్పంలో జీడీపీ 37 శాతం, తలసరి ఆదాయంలో 35శాతం పెరిగిందని సీఎం చంద్రబాబు వివరించారు. 'రూ.9,872 కోట్ల పెట్టుబడులతో 32 పరిశ్రమలు వచ్చాయి. 80,124 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. స్థానిక యువతకే కచ్చితంగా ఉద్యోగాలు ఇవ్వాలి. నియోజకవర్గంలో 8,904 బంగారు కుటుంబాలకు పీ4 ద్వారా ఆదాయ మార్గం చూపించి, జీవన ప్రమాణాలను పెంచుతున్నాం. 82 కేంద్రాల ద్వారా చెత్తను ప్రాసెస్ చేసి ఆదాయ వనరుగా మారుస్తున్నాం. చెత్తనుంచి సంపదను వృద్ధి చేసే ప్రాజెక్టులకు రూపకల్పన జరిగింది. చెత్తనుంచి విద్యుత్తు మిగతా 2లో..

### 'క్యూర్'లో లక్ష

# ఇందిరమ్మ ఇళ్లు

• 20 నియోజకవర్గాల పరిధిలో నిర్మిస్తాం .. • తొలి విడత కింద 480 ఫ్లాట్ల చొప్పున టవర్లు • పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం • శేరిలింగంపల్లిలో ఒక్కో ఫ్లాట్ విలువ దాదాపు రూ.1.25 కోట్లు • పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ టవర్లు • రాయదుర్గంలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శంకుస్థాపన



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో (క్యూర్-కోర్ అర్బన్ రీజన్‌లో) లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి చూపిస్తామని, పేదల చిరకాలస్వప్నమైన సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్ని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గజం భూమి రూ.5లక్షలు పలికే అత్యంత ఖరీదైన ప్రాంతంలో పేదలకు ఇందిరమ్మ టవర్లు నిర్మించి ఫ్లాట్లను ఇస్తామని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలిలోని మిగతా 2లో..





# సత్తుపల్లికి గోదారమ్మ!

• వచ్చేనెలలో 'సీతారామ' ట్రంక్ కెనాల్ ప్రారంభం • కమలాపురం నుంచి ట్రయల్‌రన్.. అన్నదైవం ప్రాజెక్టుకు నీరు • 25రోజుల్లో పనులు పూర్తి • రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి, సెప్టెంబరు 21 (వార్త వేదిక సూర్య):

రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులను తట్టుకొని నిలబడేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు సీతారామ ప్రాజెక్టు భరోసాగా నిలవనుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అక్టోబరులో యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేసి అదే నెలలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా మిగతా 2లో..

# జూరాల వద్ద ఉద్రిక్తత

## సాగునీటి కోసం రైతుల రాస్తారోకో



వనపర్తి, సెప్టెంబరు 21 (వార్త వేదిక సూర్య):

ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలంటూ బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద ఉద్రిక్తత నెలకొంది. జురాల ఎడమ కాల్వ ఆయకట్టు కింద పంటలు సాగు వేసి రెండు నెలలు గడవక ముందే సాగునీరు నిలిపివేయడంతో రైతులు 3 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఆత్మకూరు, అమరచింత మండలాలతో పాటు ఆయకట్టు పరిధిలోని పలు గ్రామాల నుంచి వందలాది మంది రైతులు జూరాల ప్రాజెక్టు ఆనకట్టపైకి చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి, మరికొందరిని గృహ నిర్బంధంలో ఉంచారు. గద్వాలలో రైతులు ఐదు గంటల పాటు ధర్నా చేయడంతో వాహనాలు మిగతా 2లో..

# లభ్యతను బట్టి సాగునీటి విడుదల

• జూరాలలో నీటిని నిల్వ చేయాల్సిన అవసరం ఉంది • వచ్చే సీజన్‌కు నీటి ఎద్దడి లేకుండా చర్యలు • రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):



శ్రీశైలం నుంచి ఇప్పటివరకు నాగార్జున సాగర్‌కు నేరుగా చుక్క నీరు కూడా విడుదల కాలేదని, విద్యుత్ ఉత్పత్తి ద్వారా మాత్రమే కొంత నీరు సాగర్‌కు చేరిందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. జూరాలకు ప్రస్తుతం 300 క్యూసెక్కుల నీరు కూడా రావడం లేదని చెప్పారు. జూరాల ప్రాజెక్టులో సుమారు 3 టీఎంసీల మేర పూడిక ఉందని, మరో 2 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం నిల్వ చేస్తున్నామని వివరించారు. జూరాలలో ఉన్న నీటిని పూర్తిగా విడుదల చేస్తే భవిష్యత్తులో తాగునీటి అవసరాలు ఎలా తీరుతాయని మంత్రి ప్రశ్నించారు. పాలమూరు ప్రాంతంలో 5.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఉపయోగపడేలా అదనపు రిజర్వాయర్‌ను గత ప్రభుత్వం ఎందుకు నిర్మించలేదని నిలదీశారు. 20 టీఎంసీల గట్టు రిజర్వాయర్ నిర్మిస్తామని గతంలో కేసీఆర్ ప్రకటించినప్పటికీ, పనులు చేపట్టలేదని విమర్శించారు. 15 టీఎంసీల సామర్థ్యంతో గూడెందొడ్డి సమతుల్య రిజర్వాయర్ నిర్మాణానికి తమ ప్రభుత్వం జీవో జారీ చేసి నిధులు మంజూరు మిగతా 2లో..

వార్త వేదిక సూర్య VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 124
మంగళవారం 22 సెప్టెంబర్, 2026

# ఓటుతోనే అభివృద్ధి..

(మొదటి పేజీ తరువాయి)

తయారు చేయడమూ ఇందులో భాగమే. కుప్పం నియోజకవర్గంలో 8 వేల ఇళ్లకు సోలార్ విద్యుత్తు ప్యానళ్లు అమర్చాం. వ్యవసాయానికీ దీనిని అమలు చేస్తాం. కుప్పం ఏరియా ఆస్పత్రి, 13 పీహెచ్సీలను కలిపి 1.25 లక్షల మందికి సంజీవిని ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం. శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.34 కోట్లతో 134 ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. కంగుందిలో ఇటీవల భూ వివాదాన్ని పరిష్కరించి 320 మందికి పట్టాలు పంపిణీ చేశాం' అని చంద్రబాబు అన్నారు.

## మోడల్ నియోజకవర్గంగా కుప్పం!

కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు ప్రణాళికలను తయారు చేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. కుప్పం మున్సిపాలిటీలో రూ.3.30 కోట్లతో సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ మెటీరియల్ రికవరీ ప్లాంట్ ప్రారంభించాం. యామగానిపల్లె, మాదనపల్లె ప్రాంతలో రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళిక వేస్తున్నాం. కుప్పంలో 550కుపైగా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను లిఫ్ట్ ఇరిగేషన్ పైపులైన్లతో అనుసంధానం చేస్తాం. పశు పోషణ, పౌల్ట్రీ రంగాలలో ఉపాధి అవకాశాలను, ఆదాయ మార్గాలను పెంచుతున్నాం. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనతో రైతుల ప్రయోజనాలను, లాభాలను ద్విగుణీకృతం చేస్తాం. కుప్పం, పొగురుపల్లె, కేజీఎఫ్ మీదుగా బెంగళూరుకు, పలమనేరు నుంచి కృష్ణగిరికి ఫోర్‌లేన్ రోడ్లను నిర్మించి ఇతర నగరాలకు అనుసంధానం పెంచుతున్నాం. చిత్తూరు నుంచి కుప్పానికి రైల్వే బ్రాడ్ గేజ్ చేయడానికి ప్రణాళిక వేస్తున్నాం. త్వరలోనే విమానాశ్రయం ఏర్పాటు చేయనున్నాం' అని చంద్రబాబు తన ప్రణాళికలను వెల్లడించారు.

## అభివృద్ధి కావాలా.. రౌడీయిజం కావాలా?

'రక్తాభిషేకాలు చేస్తారట. చావడానికైనా, చంపడానికైనా సిద్ధంగా ఉండాలట. ఈ మాటలు కుప్పంలో వినడం విడ్డూరంగా ఉంది. మిమ్మల్ని చంపేవాళ్లు లేరు. చంపనిచ్చే వాళ్లూ లేరు. తోక విసిరితే కత్తిరిస్తాం' అని ప్రతిపక్షంపై చంద్రబాబు ధ్వజమెత్తారు. వీళ్లను మెంటల్ అనాలా? సైకోలనాలా? అయిదేళ్లూ నేరస్తుల అడ్డాగా మార్చారు. ఇప్పుడు మీ ఆటలు చెల్లవు. 'మీకు అభివృద్ధి కావాలా? రౌడీయిజం కావాలా?' అని ప్రజలను ప్రశ్నించారు. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరు వేసే ఓట్లే వారికి గుణపాఠం కావాలి' అని సూచించారు.



# సాగునీటి ప్రాజెక్టుల పునరావాసంపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

### జిల్లాలవారీగా భూసేకరణ పురోగతిపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం, పునర్వ్యవస్థీకరణ, అటవీ సంబంధిత అంశాలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలవారీగా పనుల పురోగతిని పరిశీలించారు. ప్రాజెక్టుల వారీగా సేకరించాల్సిన భూమి, పూర్తయిన భూసేకరణ వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ కేసుల ప్రస్తుత పరిస్థితిపై కలెక్టర్లతో చర్చించారు. భూసేకరణ ప్రక్రియతో పాటు నిర్వాసిత కుటుంబాల పునరావాసం, పునర్వ్యవస్థీకరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, పరిహారం చెల్లింపు, నిర్వాసితులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. భూసేకరణ, పునరావాస ప్రక్రియను వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లకు సూచనలు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజు, భూసేకరణ–పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, ఇంజినీర్–ఇన్–చీఫ్ రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- కొత్త ఆలోచనలకు ప్రభుత్వ అండ
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వార్త వేదిక సూర్య):



దేశంలోనే ఆరోగ్య రంగ ఆవిష్కరణలకు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని ఐటీ, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ఔషధ, జీవశాస్త్ర పరిశ్రమలు, అంకుర సంస్థల సామర్థ్యాలను వైద్య రంగంతో అనుసంధానం చేస్తూ సమగ్ర ఆవిష్కరణ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. టీ–హబ్‌లో సోమవారం నిర్వహించిన 'హోమా సీఎంఈ–2026' జాతీయ సదస్సును మంత్రి ప్రారంభించారు. 'సంఖ్యలకు అతీతంగా–మధుమేహం, జీవక్రియ సంబంధిత వైద్యంలో ఖచ్చితమైన విశ్లేషణ' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేస్తున్నామని పేర్కొన్నారు. ఆధునిక జీవనశైలి మార్పుల కారణంగా మధుమేహం, ఇతర జీవక్రియ సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. జీవనశైలికి సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా ఈ వ్యాధులను సమర్థంగా ఎదుర్కొనే అవకాశముందని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు మరిన్ని నూతన ఆవిష్కరణలు అవసరమన్నారు. భవిష్యత్తులో ఆరోగ్య రంగం ఎదుర్కొనే సవాళ్లకు పరిష్కారాలు చూపే కొత్త ఆలోచనలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజారోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు వైద్య నిపుణులు, పరిశోధకులు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని శ్రీధర్‌బాబు కోరారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ముద్దు సురేంద్ర నెహ్రూ రచించిన 'ది న్యూ పారాడైమ్' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ప్రపంచంలోనే తొలి ఉచిత జీవక్రియ గణన యాప్‌గా పేర్కొన్న 'మెట్రిక్ ఎక్స్‌ప్లోరర్'ను ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఎంపిక చేసిన 50 మంది రోగులకు 'ఆలోచన అమలుసాధ్యత' కార్యక్రమం కింద ఉచిత వైద్య విధానాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

# నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు నిబంధనల సడలింపు

### ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు నిర్ణయం
### ఎల్3 నుంచి ఎల్1 వరకు ఒకేసారి ప్రత్యేక అనుమతి
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వార్త వేదిక సూర్య):



ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, నిర్మాణంలో ఉన్న ఇళ్లకు నిధులు అందేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివా స్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు సానుకూలంగా పరిగణన లోకి తీసుకుని నిబంధనలను సడలిస్తూ ఉత్త ర్వులు జారీ చేసినట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పోర్టల్‌లో ఇప్పటికే మంజూరై బేస్‌మెంట్ లేదా అంతకంటే పై స్థాయికి చేరుకున్న ఇళ్ల కు ఎల్3 నుంచి ఎల్1 కేసుల వరకు ఒకేసారి ప్రత్యేక అనుమతి (వన్‌టైమ్ క్లియరెన్స్) ఇస్తూ నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతించిం దని మంత్రి తెలిపారు. దీంతో ఇప్పటికే నిర్మా ణం ప్రారంభించిన లబ్ధిదారులకు నిధుల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగనున్నాయని పేర్కొన్నారు.

## ఒక్కసారి మాత్రమే ప్రత్యేక సడలింపు

ఈ ప్రత్యేక సడలింపు ఒక్కసారి మాత్రమే వర్తిస్తుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎల్3 మంజూరులకు దీనిని ప్రాతిపదికగా పరిగణించరాదని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ఏర్పడే మొత్తం అదనపు ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు.

## నిర్మాణం ప్రారంభం కాని ఇళ్ల మంజూర్లు రద్దు

ఇల్లు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు నిర్మాణం ప్రారంభించని ఇళ్లను రద్దు చేసి, అర్హులైన ఇతర లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు ప్రయోజనం అందేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

# సత్తుపల్లికి గోదారమ్మ!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభింపజేసి.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతానికి గోదావరి నీటిని తీసుకొస్తామని చెప్పారు. సోమవారం ఆయన కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం కమలాపురం పంపుహౌస్ వద్ద స్విచ్ ఆన్‌చేసి ట్రయల్‌రన్ నిర్వహించారు. ఆ విధంగా అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. అనంతరం పాములేరు వాగుపై నాలుగున్నర కోట్ల హైలెవెల్ బ్రిడ్జిని ప్రారంభించారు. అక్కడ నుంచి ఖమ్మం జిల్లా సత్తుపల్లి పరిధిలోని యాతాలకుంట టన్నెల పరిశీలనకు బయలుదేరారు. నాలుగున్నర కిలోమీటర్ల మేర కాలినడక ద్వారా అక్కడికి చేరుకున్నారు. టన్నెల్‌లో కొన్ని ప్రాంతాల్లోని కింది భాగంలో ఖాళీలు ఉండటంతో వాటిని కాంక్రీటుతో పూర్తి స్థాయిలో ప్యాకింగ్ చేసి పటిష్ఠం చేయాలని ఆదేశించారు. భూ సేకరణ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రూ.48 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. యాతాలకుంట టన్నెల్ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలు అందించడమే తన లక్ష్యమన్నారు. .



# 'క్యూర్'లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

రాయదుర్గం గ్రామం మల్కం చెరువు వెనుక 2.85 ఎకరాల్లో నూతనంగా నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సోమవారం భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివ్‌సరెడ్డి, పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ బోగారపు దయానంద్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపికైన లబ్ధిదారులకు ఫ్లాట్ల అలాట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాయదుర్గంలో నాలుగు టవర్లలో ఒక్కో టవర్‌లో 120 ఫ్లాట్ల చొప్పున మొత్తం 480 ఫ్లాట్లు నిర్మిస్తామన్నారు. పేద కుటుంబాల కష్టాలు, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి భద్రత, భరోసా కల్పించాలనే సంకల్పంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు వచ్చిన మహిళలకు ఒక్కొక్కరికి రూ.1.25 కోట్ల విలువ చేసే ఫ్లాట్‌ను, అన్‌డివైడెడ్ షేర్ కింద 15–20 గజాల స్థలాన్ని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ టవర్లు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదలకు నగరానికి దూరంగా 30–40 కి.మీ.ల దూరంలో ఎక్కడో ఇళ్లు ఇచ్చిందని, తమ ప్రభుత్వం లబ్ధిదారులు ఎక్కడ ఉపాధి పొందుతున్నారో అక్కడే ఖరీదైన స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తోందని మంత్రి పొంగులేటి చెప్పారు.



## 20 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం

క్యూర్ పరిధిలో 20 నియోజకవర్గాల్లో దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని, 2–3 నెలలకొకసారి డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పొంగులేటి తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద తొలి విడతగా ప్రతి నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

# లభ్యతను బట్టి సాగునీటి విడుదల

(మొదటి పేజీ తరువాయి)

చేసిందని తెలిపారు. జూరాల ఆయకట్టులో నీటి ఎద్దడి సమస్య ఉందని, ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతులు ఆరుతడి పంటలకు పరిమితం కావాలని ముందుగానే సూచించినట్లు జూపల్లి పేర్కొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రితో నీటి అంశంపై చర్చించేందుకు ప్రయత్నిస్తున్నామని, వర్షాకాలం ఇంకా ఉన్నందున ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి మరిన్ని నీళ్లు వచ్చే అవకాశం ఉందని అన్నారు. నీటి కేటాయింపుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా వినియోగం పై గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి విమర్శలు చేశారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు, రాయలసీమ ఎత్తిపోతల, ముచ్చుమర్రి, సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులు గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయని ఆరోపించారు. కల్వకు ర్తి, భీమా, నెట్టంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారని, వాటిని కేసీఆర్ ప్రభు త్వం పూర్తిస్థాయిలో పూర్తి చేయలేకపోయిందని పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై కేటీఆర్‌కు సరైన అవగా హన లేదని విమర్శించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మో టార్లు క్రమం తప్పకుండా పనిచేస్తున్నాయని, ఒక రోజు కొన్ని గంటలు మాత్రమే నిలిచాయని జూపల్లి తెలిపారు. పాలమూ రు–రంగారెడ్డి ప్రాజెక్టులో నార్లాపూర్ పంపులు ప్రారంభించేం దుకు ఇంకా సమయం పడుతుందని చెప్పారు. వచ్చే సాగు సీజన్‌లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్లకు చేరిందని మంత్రి తెలిపారు. గత ప్రభు త్వ హయాంలో గరిష్ఠ డిమాండ్ 15,497 మెగావాట్లకు మించలేదన్నారు. వర్షాలు లేకపోవడంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినా, డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం విద్యుత్ సంస్థలను ఆర్థికంగా దెబ్బతీసిందని ఆరోపించారు. ఆల్మట్టి ఎ త్తు పెంపు అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం 1997 లోనే సుప్రీం కోర్టును ఆశ్రయించి నిలుపుదల ఉత్తర్వులు పొందిందని జూ పల్లి తెలిపారు. ఈ అంశంపై న్యాయపోరాటం కొనసాగుతోం దన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన పరిస్థితులను ఎదుర్కొ నేందుకు అదనంగా రూ.20 వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజె క్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని కోరినా స్పంద న రాలేదన్నారు. రైతులను నష్టపర్చాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. బీజేపీ నాయకులు జూరాలకు రావడం కంటే ప్రధానమంత్రి వద్దకు వెళ్లి రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల సాయం, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీలు రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను రెచ్చగొట్టకుండా, రైతుల్లో మనోధైర్యం నింపేందుకు కృషి చేయాలని కోరారు. శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.



# తిరుమలేశుని సేవలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### ఎల్‌నినో ప్రభావం నుంచి ప్రజలను కాపాడాలని శ్రీవారిని వేడుకున్న ఉప ముఖ్యమంత్రి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం తెల్లవారుజామున తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ అధికారులు, అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలి కారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చె ల్లించడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనా నంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు భట్టి విక్రమార్కకు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ అధికా రులు శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అంద జేశారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా, ప్రపంచంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి పంటలు, నదులు, తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై, ప్రజల జీవన విధానంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపకూడదని స్వామివారిని వేడుకున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి దేశాన్ని, రాష్ట్రాలను కాపాడి ప్రజలను సుభిక్షంగా ఉంచాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు.

# జూరాల ప్రాజెక్టు వద్ద ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జమ్మిచేడు స్టేజీ వద్ద కూడా రైతులు ధర్నా నిర్వహించారు. బీజేపీ, బీఆర్ఎస్‌మహిళా నేతలు అక్కడికి చేరుకొని రైతులకు మద్దతు ప్రకటించారు. అదనపు కలెక్టర్ మధుమోహన్ వచ్చి నచ్చచెప్పే ప్రయత్నం చేయగా మహిళా రైతులు ఆయన కాళ్లపై పడి నీళ్లు ఇవ్వండని మొక్కారు. ఆ తర్వాత ఇరిగేషన్ ఎస్ఈ కేశవరావు ధర్నా వద్దకు వచ్చి ఒకరోజు సమయం ఇస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి చెబుతామని హామీ ఇచ్చినప్పటికీ రైతులు ససేమిరా అన్నారు. అయితే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నచ్చచెప్పడంతో అన్నదాతలు ఆందోళన విరమించారు.





# రంగారెడ్డి



## రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో 'పోషణ్ మాసం' వేడుకలు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య ) :**
రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం 9వ 'పోషణ్ మాసం' కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆహార ప్రదర్శన, పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం హాజరైన వారందరిచేత 'పోషణ ప్రతిజ్ఞ' చేయించి, పోషకాహార లోప నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం వహించే కీలక పాత్రను అధికారులు వివరంగా వివరించారు. రాజేంద్రనగర్ ఆర్డీవో శ్రీధర్, సీడీపీఓ కవిత, మాట్లా డుతూ..."సమాజంలో చిన్నారులు, గర్భిణులు మరియు బాలింతలకు లభించే పోషకాహారమే వారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బలమైన పునాది. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో స్థానికంగా లభించే పౌష్టికాహార ధాన్యాలు, ఆకుకూరలు, తాజా పండ్లు మరియు పాలు చేర్చుకోవాలి. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. తల్లి, బిడ్డల ఆరోగ్యం బాగున్నప్పుడే ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది" అని పిలుపునిచ్చారు. ?పోషకాహారంపై క్షేత్రస్థాయిలో ప్రజలందరికీ నిరంతరం అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీ టీచర్లు మరియు పర్యవేక్షకులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. వైద్యాధికారి చేతన్ తో పాటు అత్తాపూర్, హైదర్‌గూడ పర్యవేక్షకులు, పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఐక్యత, ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తాయి : టీపీసీసీ కార్యదర్శి పర్వతాల రాజేందర్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య ) :**



గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గణేష్ నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి పర్వతాల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఐక్యత, ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తా యని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం. గోపాల్ స్వామి, నితేష్, గణేష్, రాహుల్, రితేష్, సదామణిశంకర్, సాయి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ కాలనీలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య ) :**



మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌దాస్ గౌడ్ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో దొంత రాజు, కాశీగారి యాదగిరి, కొంపల్లి జగదీష్, బండారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## కేఎన్ఆర్ హిల్స్‌లో ఘనంగా వినాయక లడ్డూ వేలం

### రూ.1.05 లక్షలకు లడ్డూను దక్కించుకున్న వి. హర్షిల్ నాయుడు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య ) :**



కేఎన్ఆర్ హిల్స్‌లోని అంజలి గార్డెన్స్‌లో వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం కార్యక్రమం భక్తుల ఉత్సాహంతో ఘనంగా జరిగింది. ఈ వేలంలో నార్సింగి మార్కెట్ డైరెక్టర్ లక్ష్మిశ్రీ కుటుంబ సభ్యులు, మధుసూదన్--లక్ష్మిశ్రీ దంపతుల కుమారుడు వి. హర్షిల్ నాయుడు ఉత్సాహంగా పాల్గొని వినాయకుడి లడ్డూను రూ. 1,05,000లకు దక్కించుకున్నారు. చిన్న వయసులోనే హర్షిల్ నాయుడు వేలంలో పాల్గొని లడ్డూను సొంతం చేసుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లడ్డూ వేలంలో పలువురు భక్తులు ఉత్సాహంగా పాల్గొని పోటీపడటంతో అంజలి గార్డెన్స్‌లో సందడి నెలకొంది. వినాయకుడి ఆశీస్సులు కుటుంబ సభ్యులందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

## గొప్ప పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ : ఏర్వ సత్యనారాయణ, రాపోలు సత్తయ్య

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య ) :**
నిజాం నిరంకుశ, ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహా యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు ఏర్వ సత్యనారాయణ, రాపోలు సత్యయ్య కొనియాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు తెలంగాణ కోసం సాగిన పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని భావన ఋషి నగర్ శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ భవనంలో సోమవారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొండా లక్ష్మణ్ బాపూజీ సాహసోపేతంగా పోరాడారని తెలిపారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ప్రజల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని గుర్తుచేశారు. శాసన మండలి సభ్యుడిగా ప్రజాసేవ అందించడంతో పాటు తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన త్యాగాలు, సేవలు నేటి తరానికి



స్ఫూర్తిదాయకమని, బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాశీగారి యాదగిరి, దొంత రాజు, కొంపల్లి జగదీష్, సామల యాదయ్య, బండారి యాదగిరి, బిర్రు రాధాకృష్ణ, ఈప్పలపల్లి చిరంజీవి, సిద్దిరాల రాజ్‌కుమార్, కైరాంకొండ శ్రీనివాస్, కోట శ్యామ్‌కుమార్, ఏర్వ కుమారస్వామి, గంజి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కండేయ నగర్ వెల్ఫేర్, నవోదయ యూత్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య ) :**
కాటేదాన్ డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్ గణేష్ మండపం వద్ద గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మార్కండేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, నవోదయ యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ?వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నదాన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, స్థానికులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో ఏర్వసత్యనారాయణ, గద్దె కృష్ణ, కోట జగదీష్, పగిడిమర్రి సూర్యనారాయణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వీడం రమేష్, ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్, మామిడి శెట్టి శ్రీనివాస్, పిసికె భాస్కర్, ముషం నరేష్, కర్నాటి శ్రీనివాస్, చంద్రయ్య, ?అలాగే నవోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కోట పవన్ కుమార్, ఉడుత సురేష్, యాదగిరి భాస్కర్, రావుల నవీన్, గుత్తి మల్లేష్, ఏ. సురేష్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎన్. ధనంజయ, సరికొండ వెంకటేష్, టి. ప్రేమ్ గౌడ్, కళ్లెం లక్ష్మారెడ్డి, యంజాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

### గాంధీభవన్‌లో ఘనంగా వర్ధంతి కార్యక్రమం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య ) :**
తెలంగాణ ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు, నిరంకుశ నిజాం వ్యతిరేక పోరాట యోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుల్లో ప్రముఖుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియా డారు. ఆయన వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ చేనేత విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా కార్యక్రమం నిర్వహిం చారు. చేనేత విభాగం అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ నేత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాపూజీ చేసిన స్వాతంత్ర్యోద్యమ, తెలంగాణ ఉద్యమ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ నేత, తెలంగాణ చేనేత కార్పొరేషన్ చైర్మన్ దుడెం వెంకటరమణ నేత, వైస్ చైర్మన్ జక్కని అనిత, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్ రావు నేత, గ్రేటర్ హైదరాబాద్ మాజీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మచ్చ



వరలక్ష్మి నేత, రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాసున రవికుమార్ నేత, కొంగ కరుణ నేత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు అంకం శ్రీనివాస్ నేత, నర్సింహారావు నేత, భోగా జగదీష్ నేత, రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి బొల్లా వెంకటేష్ నేత, కంది భిక్షపతి నేత, తిరందాస్ పరమేష్ నేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నామాల నాగరాజు నేత, మంగళపల్లి సతీష్ నేత, లక్ష్మీనారాయణ నేత తదితరులు పాల్గొన్నారు.

## అరటాకు భోజనం... సిద్ధి వినాయక సంప్రదాయం





- 25వ ఏట వైభవంగా సాగిన అన్నప్రసాదం
- అరటాకుల్లో ఆప్యాయ విందు
- హాజరైన రాజయోగి వెంకటస్వామి
- విశేష సంఖ్యలో పాల్గొని భక్తజనం..

**సంగారెడ్డి( గుమ్మడిదల) వార్త వేదిక సూర్య సెప్టెంబర్ 21:**
సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, దైవ సేవయే మానవ సేవగా గుమ్మడిదలలో గత 24 ఏళ్లుగా సాగుతున్న పవిత్ర ఆనవాయితీ సిద్ధి వినాయక అన్నప్రసాద వితరణ. సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో పాతికేళ్ల రజతోత్సవ మైలురాయిగా ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ అన్నప్రసాద కార్యక్రమం ఆధ్యాత్మిక శోభ నడుమ అత్యంత వైభవంగా సాగింది... భక్తులు, దాతల సహకారంతో రెండు దశాబ్దాలకు పైగా నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమానికి ఆదివారం రాత్రి భక్తజనం విశేష సంఖ్యలో తరలివచ్చారు. మన ప్రాచీన భోజన సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ, అంతరాలు లేకుండా భక్తులందరినీ నేలపై ఒకే వరుసలో కూర్చోబెట్టి, పచ్చటి అరటి ఆకుల్లో ఆప్యాయంగా మహా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి ఆత్మానంద ఆశ్రమాధిపతి పూజ్యపాదులు రాజయోగి వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు దివ్య మంగళాశాసనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "సాటి మనిషికి ఆకలి తీర్చడమే నిజమైన దైవ ఆరాధన. పాతికేళ్లుగా సిద్ధి వినాయక సంఘం సభ్యులు మన సనాతన సంప్రదాయాన్ని కాపాడుతూ అరటాకుల్లో అన్నప్రసాదాన్ని అందించడం ఎంతో అభినందనీయం. నేలపై అందరూ సమానంగా కూర్చొని ఆరగించే ఈ ఆనవాయితీ సమాజంలో ఐక్యతను, ఆత్మీయతను పెంచుతుంది. వినాయకుడి కృపాకటాక్షాలతో గుమ్మడిదల గ్రామం, ఇక్కడి ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలి" అని ఆశీర్వదించారు.

అనంతరం మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యా గోవర్ధన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మాధవి సత్యనారాయణ, కత్తుల రమేష్, కిషన్, దేవాలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్రెడ్డి, స్థానిక పెద్దలు మండలి భాషయ్య, పడమటి లక్ష్మారెడ్డి, చెన్నంశెట్టి సత్యనారాయణ, తులసీదాస్, దేవేందర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సిద్ధి వినాయక సంఘం కమిటీ సభ్యులు సూర్యనారాయణ, మహేష్ కుమార్, కూరగాయల నర్సింలు, ఉదయ్ కుమార్, నర్సింగ్ సాగర్, కృష్ణ, రాము, నరేష్, నవీన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## ఫతేనగర్‌లో గణేష్ మండపాలను సందర్శించిన ఎంపీ ఈటల రాజేందర్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 21 (వార్త వేదిక సూర్య) :**
మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఫతేనగర్‌లో పర్యటించి పలు గణేష్ మండపాలను సందర్శించారు. ఎఫ్ బి జి వై ఎ అసోసియేషన్, బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పర్యటనలో భాగంగా ఆయన వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్, వడ్డేపల్లి రాజేశ్వర్ రావు ఎంపీ ఈటల రాజేందర్‌ను పలు గణేష్ మండపాలకు తీసుకెళ్లారు. మండపాల వద్ద జరుగుతున్న ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ, నిర్వాహకులు, స్థానిక నాయకులు, భక్తులతో మాట్లాడారు. ఫతేనగర్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలను అభినందించిన ఈటల రాజేందర్, మండపాల నిర్వాహకులకు, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, ఎఫ్ బి జి వై ఎ అసోసియేషన్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా

### విజేత జట్లకు బహుమతులు.. జోనల్ స్థాయికి ఎంపిక

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య ) :**



రాజేంద్రనగర్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ శివరాంపల్లి పాఠశాలలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో టోర్నమెంట్ కం సెలక్షన్ పోటీలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో జట్లు రాజేంద్రనగర్ మండలం తరపున జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయి. విజేత విద్యార్థులను అధికారులు, ఉపాధ్యాయులు అభినందించి, రానున్న జోనల్ స్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. అనంతరం విజేత జట్లకు రాజేంద్రనగర్ మండల ఇన్‌చార్జి గంగ్యా నాయక్, మాజీ జోనల్ ఇన్‌చార్జి బాలస్వామి రెడ్డి, రంగారెడ్డి జ్యోతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల పీటీలు వెంకట్, సురేష్, మహేందర్, తరుణ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతినే పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం

### ఆస్బెస్టాస్ కాలనీలో ఘనంగా గణపతి హోమం -- కమిటీ అధ్యక్షుడు పొన్నాల నాగరాజు.

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 21 (వార్త వేదిక సూర్య) :**




కూకట్‌పల్లి ఆస్బెస్టాస్ కాలనీలోని పీఎన్ఆర్ గల్లీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గణేష్ కమిటీ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలంతా ఐకమత్యంగా ప్రతిరోజూ నిత్య పూజలు నిర్వహిస్తూ స్వామివారికి ప్రత్యేక సేవలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున గణపతి హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. దంపతులు భక్తిశ్రద్ధలతో హోమంలో పాల్గొని విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా గణేష్ కమిటీ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త పొన్నాల నాగరాజు మాట్లాడుతూ "మట్టి గణపతినే పూజిద్దాం.. రంగు విగ్రహాలను వద్దనేద్దాం. మట్టి విగ్రహం ప్రకృతికి మేలు చేస్తుంది. మన సంప్రదాయాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మట్టి గణపతులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. కాలనీ ప్రజలంతా కలిసికట్టుగా గణేష్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని, భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్ కమిటీ సభ్యులు సుధీర్ ఠాకూర్, సోని, మనోహర్, మనస, గోలి అర్జున్ రావు, సీత, శ్రీనివాస్, విఘ్నేష్, వైష్ణవి, వారుణిక, నివేదిత, ప్రతాప్ తదితరులతో పాటు కమిటీ అధ్యక్షుడు పొన్నాల నాగరాజు, సంధ్య పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 124
మంగళవారం
22 సెప్టెంబర్ 2026

# సర్కారు 'యూటర్న్'.. ఫలించిన పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటం



**స్కిల్ వర్సిటీలో పాలిటెక్నిక్‌ల విలీన ప్రతిపాదనకు బ్రేక్**

**విద్యార్థి జేఏసీ చైర్మన్ ఎరవెల్లి జగన్ నేతృత్వంలో దక్కిన మహా విజయం**

**35 రోజుల పాటు అలుపెరగని దీక్ష, వ్యూహాత్మక ఆందోళనలు**

**సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే యథాతథంగా పాలిటెక్నిక్ కళాశాలలు**

**పాత పద్ధతిలోనే ఏఐసీటీఈ నిబంధనలు, పరీక్షల విధానం.**

**అధ్యాపకుల సహాయ నిరాకరణ, జేఏసీ ఒత్తిడితో దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం**

కూకట్ పల్లి, సెప్టెంబర్ 21 (వార్త వేదిక సూర్య):
రాష్ట్రంలో గత 35 రోజులుగా పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు చేస్తున్న సమరశీల పోరాటం ఎట్టకేలకు ఫలించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేయాలన్న ప్రతిపాదనపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. విద్యార్థి లోకం కదం తొక్కడం, అధ్యాపకులు సహాయ నిరాకరణ చేపట్టడంతో దిగొచ్చిన సర్కార్.. పాత పద్ధతిలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించాలని కీలక నిర్ణయం తీసుకుంది.

ఎరవెల్లి జగన్ నాయకత్వానికి దక్కిన అరుదైన విజయం

పాలిటెక్నిక్ కళాశాలల మనుగడను ప్రశ్నార్థకం చేసేలా ఉన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా.. పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఎరవెల్లి జగన్ సాగించిన పోరాటం ఈ విజయానికి ప్రధాన కారణం. గత 35 రోజులుగా ఆయన విద్యార్థులు, జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలను సమన్వయం చేసుకుంటూ ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. నిరంతర సమావేశాలు, భారీ ధర్నాలు, వినూత్న నిరసనలతో విద్యార్థుల సమస్యలను, వారి ఆవేదనను ప్రభుత్వ పెద్దల చెవిన వేయడంలో ఎరవెల్లి జగన్ నూటికి నూరు శాతం సఫలమయ్యారు. ఆయన అలుపెరగని దీక్ష, వ్యూహాత్మక పోరాటం వల్లే ప్రభుత్వం వెనక్కి తగ్గిందని విద్యార్థి లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. లక్షలాది మంది విద్యార్థులకు అండగా నిలిచి, సర్కారు మెడలు వంచి ఈ మహా విజయాన్ని సాధించిన జేఏసీ చైర్మన్ ఎరవెల్లి జగన్‌పై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది.

**యథాతథంగా సాంకేతిక విద్యాశాఖ**

విద్యార్థి జేఏసీ ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో.. సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు యథాతథంగా కొనసాగనున్నాయి. సాంకేతిక విద్యాశాఖ, రాష్ట్ర సాంకేతిక విద్యామండలిల మనుగడకు వచ్చిన ముప్పు తప్పింది. స్కిల్ వర్సిటీకి అనుబంధంగా సాంకేతిక విద్యాశాఖలో ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియకు కూడా ప్రభుత్వం తక్షణమే బ్రేక్ వేసింది.

**పాత పద్ధతిలోనే పరీక్షలు**

డిప్లొమా కోర్సుల నిర్వహణలో ఎలాంటి మార్పు ఉండబోదని ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అఖిల భారత సాంకేతిక విద్యామండలి నిబంధనలు, అకడమిక్ సిలబస్, పరీక్షల విధానం పూర్తిగా పాత పద్ధతిలోనే కొనసాగుతాయని ప్రకటించింది. ఈ ఆందోళనల్లో విద్యార్థులతో పాటు పాలిటెక్నిక్ అధ్యాపకులు కూడా ప్రత్యక్షంగా పాల్గొని సహాయ నిరాకరణ చేపట్టడం ఉద్యమానికి మరింత బలాన్నిచ్చింది. జేఏసీ చైర్మన్ ఎరవెల్లి జగన్ పట్టుదల, అధ్యాపకుల ఒత్తిడితో ఎట్టకేలకు పాలిటెక్నిక్ కళాశాలల పరిరక్షణ సాధ్యమైంది. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు జేఏసీ సాధించిన ఈ విజయం పాలిటెక్నిక్ విద్యా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని విద్యార్థి, అధ్యాపక సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఎరవెల్లి జగన్ కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



# నల్లగొండ



## వివేకవర్ధిని పాఠశాలలో ఘనంగా వినాయక నిమజ్జనం

మొయినాబాద్ మున్సిపాలిటీ సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య)
అజీజ్‌నగర్ గ్రామంలోని వివేకవర్ధిని పాఠశాలలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి, అనంతరం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తి శ్రద్ధలతో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుడిని అలంకరించి, విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బంది ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. "గణపతి బప్పా మోరియా" అంటూ భక్తి నినాదాలతో పరిసర ప్రాంతం మార్మోగింది. విద్యార్థుల్లో భక్తి భావంతో పాటు ఐక్యత, క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులకు వినాయక చవితి పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తెలంగాణ సమాజానికి బాపూజీ సేవలు మరువలేనివి

**జాతీయ చేనేత అధ్యక్షులు - డాక్టర్ చిక్క దేవదాసు**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 21(వార్త వేదిక సూర్య)



తెలంగాణ సమాజానికి బాపూజీ సేవలు మరువలేనివని జాతీయ చేనేత అధ్యక్షులు డాక్టర్ చిక్క దేవదాసు తెలిపారు. అశోక్‌నగర్ చౌరస్తాలోని బాపూజీ నివాసం వద్ద, నారాయణగూడ పద్మశాలి సంఘం వద్ద, అలాగే ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా ఆయనా చిత్రపటానికి ఘనంగా పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిక్క దేవదాసు మాట్లాడుతూ..ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల హక్కుల కోసం, చేనేత కార్మికులు మరియు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆయన సేవలు, త్యాగాలు, సామాజిక చైతన్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అదేవిధంగా బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ముఖ్యంగా చేనేత రంగం అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం బాపూజీ చూపిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## భూపాలపల్లి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**అదనపు కలెక్టర్ పి అశోక్ కుమార్**

భూపాలపల్లి సెప్టెంబర్-21: ( వార్త వేదిక సూర్య )



జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న ఉచిత స్క్రీనింగ్ శిబిరాలలో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేపించుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో టిబి పరీక్షలు నిర్వహణ, అనంతరం వైద్య సేవలు తదితర అంశాలపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీబీ లక్షణాలను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించడంతో వ్యాధి వ్యాప్తిని పూర్తిగా అరికట్టవచ్చని అన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, తెమడలో రక్తం పడటం, ఛాతీ నొప్పి, ఆయాసం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, త్వరగా అలసిపోవడం, మెడ లేదా ఇతర శరీర భాగాల్లో వాపులు, గడ్డలు ఏర్పడటం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని తక్షణమే పరీక్షలు చేపించుకోవాలని సూచించారు. శరీరంలోని పలు అవయవాలకు టీబీ సోకే అవకాశం ఉన్నందున అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, ఆర్డిఓ హరికృష్ణ అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు మద్దతు తెలపాలి

**సికింద్రాబాద్ అసెంబ్లి కోఆర్డినేటర్ - జి.స్వరూప**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 21(వార్త వేదిక సూర్య)



దళిత క్రైస్తవులకు మద్దతు తెలపాలని సికింద్రాబాద్ అసెంబ్లి కోఆర్డినేటర్ జి.స్వరూప సంఘీభావం తెలిపారు. సోమవారం ట్యాంక్‌బండ్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ మతం మారినంత మాత్రాన దళితులపై వివక్ష తొలగిపోదని, న్యాయం, సమానత్వం, గౌరవం కోసం దళిత క్రైస్తవులకుహోదా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీజీ బాబురావు, రాజేశ్వర్ సాలమాన్, ఎజికెల్, సద్గుణ, సంజీవ్, శాంతిరాజ్, నవీన్, ఇజ్రాయెల్, బెనర్జీ, రాజేష్, ప్రసన్న, సూసన్, పండు పలువురు పాస్టర్లు,అసెంబ్లీ కో ఆర్డినేటర్లు,కాంగ్రెస్ నాయకులు,యువతి యువకులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారంపై మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు

**విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఏసీపీకి సూచన**

మంథని, సెప్టెంబర్ -21 ( వార్త వేదిక సూర్య )
తన ఫొటోను ఉపయోగించి నిరాధార ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేశారంటూ మంథనికి చెందిన నాయిని సంతోష్ చేసిన ఫిర్యాదుపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఈ వ్యవహారంపై గోదావరిఖని ఏసీపీ విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ ఆదేశించినట్లు నాయిని సంతోష్ తెలిపారు.

తన ఫొటోను ఉపయోగించి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా తప్పుడు ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ అంశంపై పరువు నష్టం కేసును న్యాయస్థానంలో దాఖలు చేస్తున్నట్లు నాయిని సంతోష్ వెల్లడించారు. మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా తప్పుడు ప్రచారం చేయడాన్ని చట్టపరంగా ఎదుర్కొంటామని నాయిని సంతోష్ స్పష్టం చేశారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు

**మంథని బిఆర్ఎస్ నాయకులు**

మంథని, సెప్టెంబర్ -21 ( వార్త వేదిక సూర్య )



మంథనిలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్బంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు మంథని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏగోలపు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో మంథనిలోని అంబేద్కర్ సర్కిల్ దగ్గర కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహనికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు, మాజీ సర్పంచ్లు. కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్ లు,మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెగా హెల్త్ క్యాంప్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ శ్రీ హర్ష

పెద్దపల్లి,సెప్టెంబర్ - 21 ( వార్త వేదిక సూర్య )



జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష మెగా హెల్త్ క్యాంప్ పోస్టర్‌ను సోమవారం తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. సెప్టెంబర్ 23న స్థానిక ఆయుష్ వింగ్స్ హాస్పిటల్, జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లిలో జరిగే ఈ మెగా హెల్త్ ఆయుర్వేద క్యాంప్‌ను పెద్దపల్లి జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ జి.ఎన్. అరుణ, ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి. శోభారాణి, వైద్యాధికారులు డాక్టర్ కె. అమర్‌నాథ్, డాక్టర్ వి.మారుతి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్. విద్యాసాగర్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి లో 9 దరఖాస్తులు స్వీకారణ : ఎంపీడీఓ శ్రీజ రెడ్డి

మంథని, సెప్టెంబర్ -21 ( వార్త వేదిక సూర్య )
మంథని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికీ 9 దరఖాస్తులు దానిలో ఇందిరమ్మ ఇల్లు కోసం 4 , రెవిన్యూ కు సంబందించినవి 5 దరఖాస్తులు తహసీల్దార్ అరిఫోద్దీన్ తో కలసి స్వీకరించినట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో వివిధ శాఖల అధికారులు 19 మంది పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**వినాయక ఉత్సవాల్లో భాగంగా 1,500 నుంచి 2,000 మందికి అన్నప్రసాద వితరణ.**

**ముఖ్యఅతిథిగా జగద్గిరిగుట్ట సిఐ సురేష్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్**

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 21 (వార్త వేదిక సూర్య):
వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్, ప్రగతి నగర్ వన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల విష్ణు, ప్రధాన కార్యదర్శి రఘుగౌడ్, కోశాధికారి శంకర్రావు, పంతం వెంకటేష్ పటేల్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1,500 నుంచి 2,000 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమంతో ప్రగతి నగర్1 ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. ఏకదంతా యూత్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా వినాయక ఉత్సవాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తూ వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ అన్నదాన కార్యక్రమానికి జగద్గిరిగుట్ట సిఐ సురేష్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషా లతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు బాలు యాదవ్, డివిజన్ బిజెపి జనరల్ సెక్రెటరీ రజనీగౌడ్, బీజేవైఎం యూత్ అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, మల్లేష్ పటేల్, వాణి, అనిత, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ప్రగతి నగర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి సెప్టెంబర్ -21 ( వార్త వేదిక సూర్య )
అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ,అదనపు కలెక్టర్ శ్రీరాములు తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. రామగుండం మండలం గోదావరిఖని సిక్కు వాడకు చెందిన మేదరి లలిత తన కూతురు మేదరి సౌజన్య తన పేరు మీద ఉన్న ఇల్లును రిజిస్ట్రేషన్ చేసుకొని తమ బాగోగులు చూసుకోకుండా ఇంటి నుంచి వెళ్లిపోవాలని వేధింపులకు గురి చేస్తున్నారని, దరఖాస్తు చేసుకోగా ఆర్డిఓ పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కమాన్ పూర్ మండలానికి చెందిన చాట్ల అనూష తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు తీసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంథని మండలం బిట్టుపల్లి గ్రామానికి చెందిన జె.కృష్ణయ్య గ్రామ శివారులోని సర్వేనెంబర్ 56 లో గల భూమి సాదా బైనామ అమలు గురించి కోరుతూ దరఖాస్తు చేసుకోగా





తహసిల్దార్ మంథనికి రాస్తూ విచారణ చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా

**విజేత జట్లకు బహుమతులు.. జోనల్ స్థాయికి ఎంపిక**



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య ) :
రాజేంద్రనగర్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ శివరాంపల్లి పాఠశాలలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో టోర్నమెంట్ కం సెలక్షన్ పోటీలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో జట్లు రాజేంద్రనగర్ మండలం తరపున జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయి. విజేత విద్యార్థులను అధికారులు, ఉపాధ్యాయులు అభినందించి, రానున్న జోనల్ స్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.అనంతరం విజేత జట్లకు రాజేంద్రనగర్ మండల ఇన్‌చార్జి గంగ్యా నాయక్, మాజీ జోనల్ ఇన్‌చార్జి బాలస్వామి రెడ్డి, రంగారెడ్డి జ్యోతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల పీటీలు వెంకట్, సురేష్, మహేందర్, తరుణ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి

గట్టుప్పల.సెప్టెంబర్ 21.వార్త వేదిక సూర్య:



స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ శిఖరం, బహుజన రాజ్యాధికార నాయకులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు గట్టుప్పల్ మండల కేంద్రం లోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పద్మశాలి సంఘాల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నామని జగన్నాధం,మాజీ జడ్పీటిసి నామని గోపాల్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు పున్న కిషోర్, ఇడం వెంకటేశం,నామని బుచ్చయ్య,చేరుపల్లి ఆంజనేయులు,తిరాందాసు రాములు గంజి కృష్ణయ్య,సామల యాదయ్య,జెల్ల మారయ్య,నామని వెంకటేశం,కర్నాటి వెంకటేశం,పున్న ఆనంద్,చిలుకురి ఆంజయ్య,జెల్ల శ్రీనివాస్ గంజి రాములు,కుకూడాల అశోక్ ,చిలుకురి నరేందర్,ఏలే శివ శంకర్,తదితరులు పాల్గొన్నారు

## గణనాథునికి ఘనంగా పూజలు

### ఉత్సవాల్లో పాల్గొన్నా విరమల్ల శ్రీశేలం దోర్నాల భరద్వాజ్

గట్టుప్పల.సెప్టెంబర్ 21.వార్త వేదిక సూర్య:



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గట్టుప్పల మండలంలోని వివిధ గ్రామాల్లో పలు ఆలయల వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విరమల్ల శ్రీషేలం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దోర్నాల భరద్వాజ్ నేత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు వినాయక మండపలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విరమల్ల శ్రీశేలం విరాళాలు అందజేశారు.వినాయక ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## బాధితులకు చట్ట పరంగా తగిన న్యాయం చేయాలి

### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య )



సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లాలో వివిద పోలీస్ స్టేషన్ పరిదిలో నుంచి వచ్చిన దాదాపు 30 మంది బాధితులసమస్యలను, ఫిర్యాదులను విని సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ , సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి బాధితుల ఫిర్యాదుల విషయంలో ఎలాంటి జాప్యం చేయకుండా, వాస్తవాలను పూర్తిస్థాయిలో విచారించి అవసరమైన చోట కేసులు నమోదు చేయడం, దర్యాప్తు చేపట్టడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారంపై స్పష్టమైన సమాచారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ శాఖ దృష్టికి తీసుకువచ్చినప్పుడు వాటిని బాధ్యతాయుతంగా స్వీకరించి, బాధితులకు అండగా నిలవాలని జిల్లా ఎస్పీ అధికారులకు సూచించారు.

## లంబోదరుని ఆశీస్సులతో అందరి కోరికలు నెరవేరాలి

### - దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ సెప్టెంబర్ 21( వార్త వేదిక సూర్య ):-



లంబోదరుని ఆశీస్సులతో ప్రజలందరి కోరికలు నెరవేరాలని దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు. సోమవారం కొండమల్లెపల్లి పట్టణంలోని జేబీ వద్ద వినాయక నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమావత్ దాస్రు నాయక్, కేసాని లింగా రెడ్డి, బొడ్డు గోపాల్ గౌడ్,రావుల వెంకటయ్య,రమావత్ తులిసీరామ్,కర్నాటి రవి,గుండెబోయిన లింగం యాదవ్, రావుల సత్యనారి, మాజీ వార్డు సభ్యులు శేఖర్ యాదవ్,అందుగుల వెంకటేష్, వడత్య బాలు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

## గురుకులాల్లో నాసిరకం సరుకుల పంపిణీని అరికట్టాలి

**పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి**

**నేకాఫ్ సరఫరాలపై సమగ్ర విచారణ జరపాలి**

**రూ.900 కోట్ల సరఫరా వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి**

**తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ జేఏసీ, ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షులు గ్యార యాదగిరి**

దేవరకొండ సెప్టెంబర్ 21 ( వార్తా వేదిక సూర్య):-



గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకుల నాణ్యతపై సమగ్రంగా పరిశీలన చేసి, విద్యార్థుల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ జేఏసీ, ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు గ్యార యాదగిరి కోరారు. ఈ మేరకు గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం ప్రతినిధులతో కలిసి నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గురుకులాల్లో చదువుతున్న పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు పౌష్టికాహారం, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు



**విగ్రహాల ఎత్తును బట్టి ప్రత్యేక నిమజ్జన మార్గాలు**

**ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు ప్రత్యేక భద్రతా చర్యలు**

**డీజేలకు ఎలాంటి అనుమతి లేదు..**

**ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖకు సహకరించాలి**

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య )

నల్లగొండ జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్లు, ఇతర భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. గణేష్ విగ్రహాల ఎత్తును బట్టి ప్రత్యేక నిమజ్జన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు ముందుగానే తమ విగ్రహాల ఎత్తును పరిశీలించుకుని, నిర్దేశించిన నిమజ్జన ప్రదేశాలకు అనుగుణంగా రూట్ ప్లాన్ చేసుకోవాలని సూచించారు.

సెయింట్ ఆల్ఫోన్సస్ స్కూల్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్. ఓ. బి) ఉన్నందున, 10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న గణేష్ విగ్రహాలను ఈ సంవత్సరం 14 వ మైలు, హాలియా వైపు అనుమతించబడదని ఆయన పేర్కొన్నారు.

**విగ్రహాల ఎత్తును బట్టి నిమజ్జన మార్గాలు**

10 అడుగుల ఎత్తు వరకు ఉన్న విగ్రహాలను బతుకమ్మ కుంట / వల్లభరావు చెరువులో నిమజ్జనం చేసుకోవాలని అన్నారు. 10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను క్లాక్ టవర్, రామగిరి,పానగల్ ఫ్లైఓవర్, తిప్పర్తి, వేములపల్లి మార్గం ద్వారా వేములపల్లి కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రదేశంలో నిమజ్జనం చేసుకోవాలని చెప్పారు. నిమజ్జన సమయంలో భక్తులు, నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలకు అనుగుణంగా ఊరేగింపులు నిర్వహించాలన్నారు. అలాగే డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, మద్యం సేవించి గణేష్ ఊరేగింపుల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన అన్ని ధృవపత్రాలను కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంకెన్ డ్రైవింగ్) చేయరాదని సూచించారు. ఈ సంవత్సరం "జీరో యాక్సిడెంట్ -- జీరో ఇన్సిడెంట్" లక్ష్యంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కోరారు.

## ధన్వంతరి జయంతి సందర్భంగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం





నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య )

ధన్వంతరి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నల్లగొండ పట్టణంలోని పూజిత అపార్ట్మెంట్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్వంతరి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి,పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద, యునాని, హోమియోపతి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి. సుహాసిని సొలొమన్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ఆయుర్వేద వైద్యంలో మన జీవన విధానానికి అనుగుణంగా సహజ పద్ధతుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునే అనేక విధానాలు ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా, ధ్యానం చేయడంతో పాటు సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. ఆయుర్వేదం, యునాని, హోమియోపతి వైద్య విధానాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.శిబిరంలో అపార్ట్మెంట్ వాసులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలకు తగిన సూచనలు, సలహాలు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రుచిత, డీపీఎం కే. కళ్యాణ్, ఫార్మసిస్టులు భుజంగరావు, విజయలక్ష్మి, మెర్సీ, అపార్ట్మెంట్ అధ్యక్షుడు దేవయ్య, కార్యదర్శి కత్తుల యాదగిరి, కోశాధికారి సంతోష్ గుప్తా, యోగా ఇన్‌స్పెక్టర్లు, అపార్ట్మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గణనాథుని దర్శనం -- ప్రత్యేక పూజలు చేసిన బి ఆర్ఎస్ పార్టీ నాయకులు వడిత్య రమేష్



దేవరకొండ సెప్టెంబర్ 21 ( వార్తా వేదిక సూర్య):-

కొండమల్లెపల్లి పట్టణం 6 వ వార్డు లో కొలువైన శ్రీ గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న బి.ఆర్.ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వద్య రమేష్ నాయక్ . అనంతరం వద్య రమేష్ నాయక్ గారిని గణనాథుని ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు బి.ఆర్.ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వద్య రమేష్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పెద్దిశెట్టి సత్యం, నరేందర్ ,పాండు ,శివ దుర్గయ్య ,వార్డు నరేష్,శంకర్, రమేష్, జవహర్ లాల్ ,మురళి,అభి, రామాంజనేయులు ,కుమార్ ,భరత్,బీమా నాయక్ ,కోటేష్,దుర్గా,చింటూ, సురేష్,పాల్గొన్నారు శ్రీ గణనాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నాము



## టీఎన్జీవోస్ కాలనీలో ఘనంగా గణేష్ పూజలు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య ) :

టీఎన్జీవోస్ కాలనీలోని శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో టీడీపీ సీనియర్ నాయకులు యు. విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహించడం అభినందనీయమన్నారు.

## జల్‌పల్లి డివిజన్‌లో ముమ్మరంగా 'కార్డన్ సెర్చ్'.. పహాడీ షరీఫ్ పోలీసులు, ఆర్మీ బలగాల తనిఖీలు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య ) :



గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పహాడీ షరీఫ్ పోలీసులు, ఆర్మీ బలగాలతో కలిసి జల్‌పల్లి డివిజన్‌లోని పలు కాలనీల్లో సెప్టెంబర్ 21న 'కార్డన్ సెర్చ్' నిర్వహించారు.?పహాడీ షరీఫ్ పోలీస్ సిబ్బంది, ఎస్ఐ లక్ష్మయ్య యాదవ్, సీఆర్‌పీఎఫ్ కమాండో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది బలగాలతో కలిసి కాలనీల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగేలా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.?నిమజ్జన ఉత్సవాలు ముగిసే వరకు ప్రజలు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## గణనాధుని పుజ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు - మంద జగన్

సికింద్రాబాద్, సెప్టెంబర్ 21(వార్త వేదిక సూర్య)



గణేష్ నవరాత్రుల సందర్భంగా బజరంగ్దళ్ ఉత్సవ సమితి ఆర్గనైజర్ చింతల సాయి కుమార్ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ నాయకులు మాజీ వార్డు మెంబర్ మంద జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ.. 2028 లో తిరిగి ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బాధ్యతలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతకింది మల్లేష్ సాయి కిరణ్, పోలీస్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుని దర్శించుకున్న రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ సెప్టెంబర్ 21 ( వార్తా వేదిక సూర్య):-



కొండమల్లెపల్లి మండలం లోని దోన్యాల గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడిని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తిభావంతో పాటు సేవా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని, గణనాథుని ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు రమావత్ దాస్రు నాయక్, బొడ్డు గోపాల్ గౌడ్,చెన్నారం సర్పంచ్ రమావత్ తులిసీరామ్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎలిమినేటి రాములు యాదగిరి రావుల వెంకటయ్య, మాజీ వార్డు సభ్యులు శేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ వెంకటేష్, పులిరాజు గౌడ్,తదితరులు పాల్గొన్నారు

## నామాని సత్యనారాయణ మృతి బాధాకరం

### -మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ సెప్టెంబర్ 21( వార్త వేదిక సూర్య):-

దేవరకొండ పట్టణానికి చెందిన నామాని సత్యనారాయణ మృతి బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.సోమవారం దేవరకొండ పట్టణంలోని సాయిశివ గార్డెన్‌లో నిర్వహించిన సత్యనారాయణ దశదిన కర్మ కార్యక్రమానికి రమావత్ రవీంద్ర కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు. ఆయన వెంట బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బొడ్డు గోపాల్ గౌడ్,అడ్వకేట్ వనం జగదీశ్వర్,బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## వినాయక మండపాన్ని దర్శించుకున్న జాలే నరసింహారెడ్డి

దేవరకొండ సెప్టెంబర్ 21 (వార్తా వార్త వేదిక సూర్య):-

హైదరాబాద్ లోని హస్తినాపురం సంతోషిమాత కాలనీలో కొలువుదీరిన గణనాథుని నేడు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి జాలే నరసింహా రెడ్డి పిఎసిఎస్ చైర్మన్ ఈ సందర్భంగా నరసింహారెడ్డి దేవరకొండ నియోజకవర్గ ప్రాంత ప్రజలపై ఆ గణనాథుని ఆశీస్సులు ఉండి సకాలంలో వర్షాలు కురిసి ఆయురారోగ్యాలతో సుఖాసంతోషాలతో పాడి పంటలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 124
మంగళవారం
22 సెప్టెంబర్ 2026



## నవాబుపేటలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం

### ప్రజల సమస్యలపై అధికారులకు వినతులు

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య):

నవాబుపేట మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి వివిధ శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూ సంబంధిత సమస్యలు, పింఛన్లు, ఇళ్ల నిర్మాణం, విద్యుత్, పారిశుధ్యం, తదితర సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు.

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి పటిష్ట పోలీసు బందోబస్తు

### నిమజ్జన రూట్లను పరిశీలించిన ఎస్పీ డి.జానకి..

### కీలక ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు

మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య):



గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ డి.జానకి, జిల్లా పోలీసు అధికారులతో కలిసి పట్టణంలోని గణేష్ శోభాయాత్ర, నిమజ్జన ప్రధాన రూట్లు, ముఖ్య కూడళ్లు, సున్నిత ప్రాంతాలు, నిమజ్జన పాయింట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అప్పన్నపల్లి ఈకో పార్క్ ఎదురుగా, పంచవటి స్కూల్ సమీపంలో, చిన్నదర్పల్లి సమీపంలో ఏర్పాటు చేసిన కృత్రిమ బేబీ పాండ్లను ఎస్పీ పరిశీలించారు. నిమజ్జన సమయంలో భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే చిన్న గణేష్ విగ్రహాల కోసం బైపాస్ రోడ్డుపై ఏర్పాటు చేసిన కలెక్షన్ పాయింట్లను కూడా పరిశీలించారు.

**క్లాక్ టవర్ వైపు వాహనాల రాకపోకలకు ఆంక్షలు...**

గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా ప్రధాన రహదారులు, కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందున వాహనదారులు ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. హైదరాబాద్, భూత్పూర్, రాయచూర్, కోయిలకొండ, చించోలి తదితర ప్రాంతాల నుంచి మహబూబ్‌నగర్ పట్టణంలోకి వచ్చే భారీ వాహనాలు తప్పనిసరిగా బైపాస్ రోడ్డును వినియోగించుకోవాలని తెలిపారు.

సెప్టెంబర్ 21 సాయంత్రం 6 గంటల నుంచి సెప్టెంబర్ 25 ఉదయం 6 గంటల వరకు మహబూబ్‌నగర్ పట్టణంలోని క్లాక్ టవర్ కూడలిలో అన్ని రకాల వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదని పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు క్లాక్ టవర్ వైపు రాకుండా ట్రాఫిక్ పోలీసులు సూచించే ప్రత్యామ్నాయ మార్గాలను, ట్రాఫిక్ మళ్లింపులను పాటించాలని కోరారు.

**డీజే లకు అనుమతి లేదు...**

గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాల్లో డీజే సౌండ్ సిస్టమ్ వినియోగానికి అనుమతి లేదని జిల్లా పోలీస్ శాఖ స్పష్టం చేసింది. అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్స్, డీజే లను ఉపయోగించి ప్రజలకు, ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించింది. భక్తి, సంప్రదాయాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరింది.

**ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తే చర్యలు..**

గణేష్ ఉత్సవాలు, శోభాయాత్ర, నిమజ్జనం, ట్రాఫిక్ మళ్లింపులు, పోలీసు బందోబస్తుకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే అసత్య, నిర్ధారణ కాని వార్తలు, వదంతులు, పాత వీడియోలు లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని ప్రచారం చేయడం, షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయవద్దని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో కనిపించే సమాచారాన్ని నిజానిజాలు నిర్ధారించుకోకుండా ఇతరులకు పంపవద్దని సూచించారు. అనుమానాస్పద సమాచారం లేదా వదంతులు వ్యాప్తి చెందుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ డి.జానకి కోరారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో డీఎస్పీ శ్రీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్యతో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం చేయాలి

### దళిత జర్నలిస్టుల ఫోరం

మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య):

దళిత జర్నలిస్టు కె. శ్రీనివాస్ ఆకస్మిక మృతి పట్ల దళిత జర్నలిస్టుల ఫోరం (ఐజీఫ్) తీవ్ర విచారం వ్యక్తం చేసింది. జర్నలిజం రంగంలో తన వృత్తి బాధ్యతలను నిర్వర్తిస్తూ పనిచేసిన శ్రీనివాస్ మరణం జర్నలిస్టు సమాజానికి తీరని లోటని ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్ పేర్కొన్నారు. శ్రీనివాస్ మృతి నేపథ్యంలో ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉన్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన కోరారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబానికి అవసరమైన ఇతర సహాయాన్ని కూడా ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కాశపోగు జాన్ అన్నారు. ముఖ్యంగా అణగారిన వర్గాలకు చెందిన జర్నలిస్టులు అనుకోని పరిస్థితుల్లో మృతి చెందినప్పుడు వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక సంక్షేమ చర్యలు ఉండాలని సూచించారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు దళిత జర్నలిస్టుల ఫోరం తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు తప్పవు



### అక్రిడిటేషన్, ఇళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### టీజేఏ నాయకులు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు దస్తగిరి

వార్త వేదిక సూర్య నాగర్ కర్నూల్ జిల్లా తేది 21

జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అక్రిడిటేషన్, ఇళ్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే జర్నలిస్టులను ఐక్యం చేసి ఉద్యమాలకు సిద్ధమవుతామని టీజేఏ నాయకులు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు దస్తగిరి హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కు సమర్పించారు.

ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు పూర్తిస్థాయిలో అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేయకపోవడంతో సుమారు 250 మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే అనేక సంవత్సరాలుగా జర్నలిస్టులుగా పనిచేస్తున్నప్పటికీ సొంత ఇళ్లు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు హెల్త్ కార్డులు, రైల్వే పాసులు మంజూరు చేయాలని, గతంలో మాదిరిగా వన్‌బైథర్డ్ బస్సు పాసులు అందించాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే భవిష్యత్‌లో ఉద్యమ కార్యాచరణ చేపడతామని దస్తగిరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శ్యామ్ సుందర్ శ్రీనివాస్ రెడ్డి విజయేందర్ రెడ్డి శేఖర్ శ్రావణ్ కుమార్ సతీష్ కుమార్ రుక్మొద్దీన్ అవేజ్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఆర్ఎస్‌లో తప్పనిసరిగా నమోదు కావాలి

### వచ్చే నెల నుంచి ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదైన సిబ్బందికే వేతనాలు,

### అన్ని శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశాలు,

వార్త వేదిక సూర్య నాగర్ కర్నూలు జిల్లా

నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)లో తప్పనిసరిగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. మండల, డివిజన్, క్లస్టర్, గ్రామ స్థాయిల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగిని ఎఫ్ఆర్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని, సిబ్బంది నమోదు ప్రక్రియను ఈ నెలలోపు పూర్తి చేయాలని అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

సోమవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ హాజరు ఏర్పాట్లు అదనపు కలెక్టర్లు బి చెన్నయ్య, దేవ సహాయం లతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ............ అన్ని శాఖల సిబ్బంది హాజరు, వాస్తవ సిబ్బంది సంఖ్యను ఖచ్చితంగా నిర్ధారించేందుకు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. కొన్ని శాఖల్లో సిబ్బంది ఇంకా ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు కాలేదని గుర్తించినట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ నమోదును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

శాఖల వారీగా పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, ఎఫ్ఆర్ఎస్‌లో నమోదైన ఉద్యోగుల సంఖ్యను పరిశీలించాలని సూచించారు. నమోదు కాని సిబ్బందిని వెంటనే ఎఫ్ఆర్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని



అధికారులను ఆదేశించారు.

వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవన తదితర శాఖలు ఇప్పటికే తమ శాఖలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ వ్యవస్థలను వినియోగిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన శాఖల సిబ్బంది అందుబాటులో ఉన్న ఈ-ఎస్‌పీఎస్ ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థను ఉపయోగించి హాజరు నమోదు చేయాలని సూచించారు.

ఎఫ్ఆర్ఎస్ నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులు ఈ డి ఎం తో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించుకోవాలని ఆదేశించారు. ఎఫ్ఆర్ఎస్ నమోదు, హాజరు విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి శాఖ అధికారి బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

వచ్చే నెల నుంచి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని మరింత కఠినంగా అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు కాని సిబ్బంది వివరాలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదయ్యే హాజరుకు అనుగుణంగా వేతన చెల్లింపులపై చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత శాఖల అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎఫ్ఆర్ఎస్ ఆధారిత హాజరు నమోదును క్రమబద్ధీకరించాలని, అధికారులు తమ పరిధిలోని సిబ్బంది హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

## జూరాల ప్రాజెక్టు ముట్టడి నేపథ్యంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి హౌస్ అరెస్ట్



జడ్చర్ల తిరుమలహిల్స్‌లో భారీగా పోలీసుల మోహరింపు

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య):

జూరాల ఆయకట్టు రైతులకు సాగునీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన జూరాల ప్రాజెక్టు ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో జడ్చర్లలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కార్యక్రమాన్ని అడ్డుకునే చర్యల్లో భాగంగా పోలీసులు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ నేపథ్యంలో జడ్చర్ల తిరుమలహిల్స్‌లోని తన నివాసంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు డా. సి. లక్ష్మారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలనే డిమాండ్‌తో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తు చర్యగా ఈ హౌస్ అరెస్ట్ చేసినట్లు సమాచారం.

ఈ సందర్భంగా డా. సి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జూరాల ఆయకట్టు రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు సాగునీరు అందించాలనే డిమాండ్‌తో శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తున్న నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

జూరాల ఆయకట్టు పరిధిలో పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటి విడుదలపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జూరాల ప్రాజెక్టు ముట్టడి నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.





# మహబూబ్‌నగర్



## కొత్తకోట అభివృద్ధికి మరో ముందడుగు

### చేనగ చెరువు కట్ట, సంత బజార్ అభివృద్ధి పనులకు భూమిపూజ

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య):



దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. చేనగ చెరువు కట్ట అభివృద్ధి, సంత బజార్ ఆధునీకరణ పనులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్ ) భూమిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందుగా భవానమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు, స్థానికంగా వ్యాపార కార్యకలాపాలకు అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

చేనగ చెరువు కట్ట అభివృద్ధి పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు మరింత సౌకర్యం కలగడంతో పాటు, పరిసర ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా సంత బజార్‌ను ఆధునీకరించడం ద్వారా వ్యాపారులు, కొనుగోలుదారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

కొత్తకోట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని, ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు కొనసాగిస్తామని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ జరగడంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

## అశోక్ వైద్య ఖర్చులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం

### పాలమాకుల రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా జర్పుల భాస్కర్

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య):





పాలమాకుల సమీపంలో అర్ధరాత్రి సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నవాబుపేట మండలం మెట్టుగడ్డ తండాకు చెందిన లింబ్యా నాయక్, మాన్సింగ్ నాయక్, జమున, వాస్రం నాయక్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటనలో డ్రైవర్ అశోక్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రమాదం అనంతరం అశోక్‌ను తొలుత శంషాబాద్‌లోని ట్రైడెంట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్యం అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. అశోక్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడిన జర్పుల భాస్కర్, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు.

అశోక్ వైద్య ఖర్చుల కోసం రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తూ జర్పుల భాస్కర్ కుటుంబానికి అండగా నిలిచారు. ట్రైడెంట్, కాంటినెంటల్ ఆసుపత్రుల్లో జరుగుతున్న వైద్య ఖర్చుల విషయంలోనూ సహకారం అందించారు. ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న అశోక్‌ను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచి, వైద్య సహాయం అందించడం పట్ల స్థానికులు జర్పుల భాస్కర్‌ను అభినందించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సమయంలో చేయూతనివ్వడం మానవత్వానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు జర్పుల భాస్కర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన అశోక్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## కొప్పుల భీమయ్య పార్థివదేహానికి నాయకుల నివాళులు

మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య):

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం అంచన్‌పల్లి గ్రామానికి చెందిన కొప్పుల భీమయ్య మృతి చెందడంతో పలువురు నాయకులు ఆయన స్వగ్రామానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ కప్లాపూర్ ఆశన్న, ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పగిడ్యాల బోరు కృష్ణయ్య, గండీడ్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చిట్లపల్లి మహేందర్, సీనియర్ నాయకులు కొండాపూర్ దస్తయ్య, ముకర్లాబాద్ ఓం ప్రకాష్, చెన్నయ్య పోలీస్, నర్సింలు, నర్సయ్య, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



### సహస్ర దీపారాధనతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న

# చౌటుప్పల్ కాంప్లెక్స్



**చౌటుప్పల్ సెప్టెంబర్ 22 వార్తా వేదిక సూర్య** :యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మున్సిపాలిటీలోని చౌటుప్పల కాంప్లెక్స్ లో ద్వాదశ గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తిశ్రద్ధలతో సహస్ర దీపారాధన సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాధుడికి దీపారాధన చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చౌటుప్పల మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, పాల్గొని మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో దీపారాధనకు విశిష్టమైన ప్రాధాన్యత ఉంది, దీపం జ్ఞానానికి, పవిత్రతకు, శుభానికి ప్రత్యేకగా భావిస్తారు అని అన్నారు. దీపం చీకటిని తొలగించి వెలుగును ప్రస రింపజేసే దీపం మాదిరిగా నే మన జీవితాల్లో అజ్ఞానం, అశుభాలను తొ లగించి జ్ఞానం, సానుకూలత, శాంతి నెలకొనాలని సహస్ర దీపారాధన నిర్వహించడం వెనుక ఆధ్యాత్మిక భావన ఉందని అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 1000 దీపాలను వెలిగించి గణపతి స్వామి వారికి సమర్పించడం ద్వారా స్వర్గలోక శాంతి, ప్రజల సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం, సమాజంలో సౌభ్రావృత్తం నెల కొనాలని భక్తులు ప్రార్థిస్తారని అన్నారు. దీపాల వెలుగులతో చౌటుప్పల్ కాంప్లెక్స్ పరిసరాల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందని కొనియాడారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రజలు భక్తి భావంతో పాటు, ఐక్యత, సామాజిక సౌభ్రభృత్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో గణనాథుడిని పూజించి, సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ వ్యాపారస్తులు, గోషిక కరుణాకర్, బద్దం లింగారెడ్డి, గోశిక పాండు, మసరం యాదగిరి, లోక విష్ణు, గోలి యాదగిరి, ములుగు లక్ష్మయ్య, దొంత మల్లేశం, కర్నాటి శ్యామ్, మాజీ ఎంపిటిసి గోశిక సుమతి, శాంతి శ్రీ తదితరులు పాల్గొన్నారు.









# యాదాద్రి భువనగిరి

## పాఠశాలకు ఫ్యాన్లు బహుకరణ



**చౌటుప్పల్ సెప్టెంబర్ 22 వార్తా వేదిక సూర్య** :చౌటుప్పల్ మండలంలోని నెలపట్ల ప్రాథమిక పాఠశాలకు తరగతి గదిలో ఫ్యాన్లు లేకపోవడం వలన విద్యార్థిని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న సందర్భంగా షేక్ గాలిబ్ ఈ విషయం తెలుసుకొని తన వంతు సహాయంగా రెండు ఫ్యాన్లు సోమవారం ప్రధానోపాధ్యారాలు వి. మంజుల కు షేక్ గాలిబ్ రెండు ఫ్యాన్లు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు , విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు షేక్ గాలిబ్ కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్వేత , దబ్బటి శేఖర్ , కొరగొని నర్సింహం , బుట్టి సత్యం , షేక్ జాంగిర్ , సింగిశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గణపతి సన్నిధిలో మత సామరస్య పరిమళం

**అబ్దుల్ అలీం ఆధ్వర్యంలో అన్నదానం.. గంగా--జమునా తహజీబ్‌కు భువనగిరి ప్రతీక**



**భువనగిరి, సెప్టెంబర్ 21 ,వార్త వేదిక సూర్య** :వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భువనగిరి పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గణపతి మండపం వద్ద క్రిస్టల్ టౌన్‌షిప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ ఆధ్వర్యంలో, మేనేజర్ అబ్దుల్ అలీం నేతృత్వంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.కులమతాలకు అతీతంగా గణపతి మండపం వద్ద అన్నదానం నిర్వహించడం సంతోషకరమైన విషయమని మండపం యూత్ సభ్యులు పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు హిందూ--ముస్లింల మధ్య సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించిన అబ్దుల్ అలీంకు కాలనీ వాసుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా అబ్దుల్ అలీం మాట్లాడుతూ.. తెలంగాణలో గంగా--జమునా తహజీబ్ సంప్రదాయం కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా భువనగిరి పట్టణంలో అన్ని కులాలు, మతాల ప్రజలు ఐక్యతతో అన్ని పండుగలను కలిసి నిర్వహిస్తున్నారని తెలిపారు. పరస్పర సోదరభావం, మత సామరస్యాన్ని చాటడంలో భాగంగానే గణపతి మండపం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తీ, మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేష్, 30వ వార్డు కౌన్సిలర్ ఎం.డి. లయీఖ్ అహ్మద్, 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్య తబస్సుం, షఫీక్ అహ్మద్, పోతంశెట్టి శ్రీను, అమర్, వెంకటేష్, శ్రీశైలం, ఆరిఫ్, ఫహీం, యూత్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డిగూడెంలో అన్నప్రసాదం

**- కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నర్రి రజిత మల్లేశం, శ్రీ శివ భక్త ఆంజనేయ స్వామి వైస్ చైర్మన్ నర్రి స్వామి సంతోష దంపతులు నిర్వహించారు**



**సంస్థాన్ నారాయణపురం సెప్టెంబర్ 21:- (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మల్లారెడ్డిగూడెం గ్రామంలో యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ విఘ్నేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన తదానంతరం కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన పోషకులుగా మల్లారెడ్డి గూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్రి మల్లేశం, రజిత, శ్రీ శివ భక్త ఆంజనేయస్వామి ఆలయ కమిటీ వైస్ చైర్మన్ నర్రి స్వామి సంతోషం దంపతులకు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డిగూడెం ఉపసర్పంచ్ నర్రి ఎటయ్య, గ్రామ వార్డ్ మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ ప్రజలు, ఈ అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మోటకొండూర్‌లో అన్న ప్రసాద వితరణ



**మోటకొండూరు/వార్త వేధిక సూర్య:-**:మోటకొండూర్ మండల కేంద్రమైన మోటకొండూర్ లో నవ తెలంగాణ విలేకరి పుల్లె నరేష్ యాదవ్ మరియు వారి కుటుంబ సభ్యులు పుల్లె శిరీష ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గణనాథుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు, గ్రామస్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా పుల్లె నరేష్ యాదవ్ మాట్లాడుతూ... ప్రతి ఏటా తమ కుటుంబం ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, దేవుడి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భూమండ్ల శ్రీనివాస్ ,బుగ్గ కొమురయ్య ,తోటి జర్నలిస్టులు,పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## గణపతికి ప్రత్యేక పూజలు

**- గణేష్ మండపాలను సందర్శించిన కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పోత్నక్ ప్రమోద్ కుమార్**



**భువనగిరి టౌన్, సెప్టెంబర్ 21 ,వార్త వేదిక సూర్య :**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భువనగిరి పట్టణంలోని పలు గణేష్ మండపాలను పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ సందర్శించారు. నూా= యూత్ అసోసియేషన్, మీనా నగర్‌లోని వీర శివాజీ యూత్ అసోసియేషన్, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణపతి మండపంలో కొబ్బరికాయ కొట్టి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, భువనగిరి నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆయన గణనాథుడిని ప్రార్థించారు.కార్యక్రమంలో ఆయా యూత్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

**మోత్కూరు, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య):** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ మంత్రి, ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య అన్నారు. సోమవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 14వ, వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలను నిర్వర్తించాలని తెలిపారు.. స్వరాష్ట్ర సాధన కోసం తొలిదశ ఉద్యమం సమయంలో 1969 లో తనమంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేశారని, మలి దశలో ఉద్యమంలో కూడా 2011 లో ఢిల్లీ వేదికగా 97 ఏళ్ల వయస్సులో ఉద్యమపోరు బాట చేశారని ఆయన సేవలను గుర్తు చేశారు.పేద వర్గాల కోసంతో పాటు రాష్ట సాధన కోసం మరి తపించిన లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ ఎస్ పట్టణ అధ్యకులు నిలిగొండ మత్స్యగిరి, కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు మొరిగాల సురేష్ స్థానికులు నల్లపోగుల వెంకన్న, బిక్షపతి,శ్రీను తదితరులు పాల్గొన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో....... పద్మశాలి జాతిపిత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి పురస్కరించుకొని పద్మశాలి సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం పట్టణ అధ్యక్ష ,కార్యదర్శులు కూరపాటి రాములు, పసునూరి యాదయ్య, కోశాధికారి నోముల రమేష్ నేత, తెలంగాణ రాష్ట్ర కార్మిక సంఘం ఉపాధ్యక్షులు పోచం కన్నయ్య, మాజీ అధ్యక్షులు పెండెం శ్రీనివాస్, రహీంఖాన్ పేట మాజీ అధ్యక్షులు కొక్కుల సత్యనారాయణ, నాయకులు బిరుదు శ్రీను,జల్ది సోమయ్య తదితరులు పాల్గొన్నారు. చేనేత సహకార పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో...... . కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని చేనేత సహకార పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేనేత పారిశ్రామిక సహకార సంఘం ప్రధాన కార్యదర్శి మహేశ్వరం మధుసూదన్, కోశాధికారి పోచం కన్నయ్య, డైరెక్టర్లు పెండెం రాజారాం, రాష్ట్ర నాయకులు పాశికంటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గంగుల రాములు, పోచం బిక్షపతి, పద్మశాలి పట్టణ అధ్యక్షులు మహేశ్వరం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## 700 సర్వే నెంబర్లు పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

**చౌటుప్పల్ సెప్టెంబర్ 22 వార్తా వేదిక సూర్య.** 700 సర్వే నెంబర్లు పట్టాలి ఇచ్చిన వారికి ఇండ్ల స్థలాలు చూపించి వారికి పట్టాలు ఇవ్వాలని పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. సోమవారం హనుమాన్ వాడ శాఖా సమావేశానికి అధ్యక్షత గా కొత్త లలిత వహించారు. వార్డులోని సమస్యలను పరిష్కరించాలని డ్రైనేజీ సిసి రోడ్లు వీధిలైట్లు సరిగా రావడం లేదని హనుమాన్ వాడాలోని 20 సంవత్సరాల క్రితం 700 సర్వే నెంబర్ లో పట్టాలి ఇచ్చి స్థలం చూపించలేదు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ సమావేశంలో అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు పేరుతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన తర్వాత గ్యారెంటీలను మార్చారు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇస్తామని పెన్షన్లు 4000 ఇస్తామని వికలాంగులకు 6000 ఇస్తామని ప్రతి ఇంటి మహిళలకు 2500 ఇస్తామని పేదలకు పెళ్లి చేసుకుంటే తులం బంగారం ఇస్తామని అనేక హామీలు ఇచ్చి మొండి చేయి చూసినారు ఇప్పటికైనా 6 గ్యారంటీలు అమలు చేయాలని వారు అన్నారు. ఈ సమావేశా ములో నూతన శాఖ కార్యదర్శిగా నరాల నరసింహను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సమావేశానికి పట్టణ కార్యవర్గ సభ్యుడు వనం రాజు, పట్టణ నాయకులు బర్ల వెంకటేష్ ,దిడ్డి కాడి మైసయ్య, నరాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంజూరు చేయాలి



**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 21 (వార్త వేదిక సూర్య ):** తండా గ్రామపంచాయతీలకు నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంజూరులి చేయాలి ఐతీ భూక్య సంతోష్ నాయక్...తెలంగాణ గిరిజన సర్పంచ్ ఫోరంఈరోజు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ గిరిజన సర్పంచ్ ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ గిరిజన సర్పంచ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు భూక్య సంతోష్ నాయక్.....లి గారు మాట్లాడుతూ తెలంగాణ మరియు యాదాద్రి భువనగిరి జిల్లాలో లోని గ్రామపంచాయతీ నూతన గ్రామపంచాయతీగా ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటివరకు సొంత పంచాయతీ భవనం లేదు. సర్పంచులు, పాలకవర్గాలు మారుతున్నా గ్రామపంచాయతీకి భవనం లేకపోవడంతో పరిపాలనా కార్యక్రమాలు, గ్రామసభలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే కొన్ని గ్రామపంచాయతీలు కట్టడానికి భూమి లేదు వారికి భూమిని కేటాయించి,గ్రామ ప్రజల సౌకర్యం మరియు పంచాయతీ పరిపాలనను దృష్టిలో ఉంచుకొని మా గ్రామపంచాయతీకి సొంత భవనం మంజూరు చేయాలనీ కోరారు , , ఈ కార్యక్రమంలో రామోజీ నాయక్ తండ సర్పంచ్ బానోత్ సతీష్ కుమార్, మరియు దయ్యం బండ తండా సర్పంచ్ సుధాకర్ నాయక్, బద్దు తండా సర్పంచ్ కవిత శ్రీనివాస్ నాయక్,పెద్ద పలుగు తాండ సర్పంచ్ జగన్ నాయక్,చొక్లతండా బానోత్ పాండులి,తదితర పాల్గొన్నారు

## బహదూర్ పేట గొర్ల కాపర్ల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**ఆలేరు,సెప్టెంబర్ 21 (వార్త వేదిక సూర్య ):** మున్సిపాలిటీ ఆరో వార్డు బహదూర్‌పేటలో నూతన గొర్ల కాపర్ల సంఘం కార్యవర్గాన్ని ఆదివారం కురుమ సంఘం ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంఘం నూతన అధ్యక్షుడిగా వట్టిపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా కుళ్ళ శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా వట్టిపల్లి రాములు, కోశాధికారిగా వట్టిపల్లి వెంకటేష్, గౌరవ సభ్యులుగా వస్పరి శ్రీనివాస్, బీదని యాదగిరి, వస్పరి నర్సయ్య తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వట్టిపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ గొర్ల కాపర్ల సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు కుళ్ళ చంద్ర శేఖర్. పెద్ద కురుమ వస్పరి స్వామి ,జెట్ట బాల నరసయ్య, కుళ్ళ సిద్ధులు, కుండె సంపత్ , కుళ్ళ వెంకటేష్, కర్రే సత్తయ్య , వస్పరి సంపత్ కుమార్, చిన్నం వెంకటేష్, బీదని హరీష్, పాల్గొన్నారు.

## 22వ వార్డులో నూతన విద్యుత్ దీపాల ఏర్పాటు

**- నూతన విద్యుత్ లైన్లతో వెలుగులోకి న్యూ రామ్‌నగర్, ఇందిరానగర్ -- కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్**



**భువనగిరి టౌన్, సెప్టెంబర్ 21,వార్త వేదిక సూర్య :** భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో నూతన విద్యుత్ దీపాల ఏర్పాటు, మరమ్మతు పనులు చేపట్టారు. వార్డులోని న్యూ రామ్‌నగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు దీపాలను అమర్చడంతో పాటు, పనిచేయని కొన్ని విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో వార్డులో అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.అతి తక్కువ సమయంలోనే నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ దీపాలను అమర్చిన కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్‌ను స్థానికులు అభినందించారు. విద్యుత్ దీపాల ఏర్పాటుతో రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు తగ్గడంతో పాటు భద్రతకు కూడా దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మనీష్, ప్రమోద్, శివ, వరుణ్, సందీప్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం



**తుంగతుర్తి, సెప్టెంబర్ 21 (వార్త వేదిక సూర్య):** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రంలో ఫ్రెండ్స్ సర్కిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం సాయంత్రం గంగపుత్ర సంఘం నాయకులు గంగధారి హరికృష్ణ, గంగధారి మురలీకృష్ణ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామస్తులు తదితరు పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 124 || మంగళవారం || సెప్టెంబర్, 22, 2026



# యాదాద్రి భువనగిరి

# భూసేకరణ పనులను వేగవంతం చేయాలి

- ఇప్పటికే విడుదలైన నిధులను లబ్ధిదారులకు వెంటనే చెల్లించాలి
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**భువనగిరి టౌన్, సెప్టెంబర్ 21 వార్త వేదిక సూర్య** రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం--పునరావాస పునరుద్ధం ణ (ఆర్అండ్ఆర్) పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పెండింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. భువనగిరి జిల్లా నుంచి ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రవీందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నీటిపారుదల ప్రాజెక్టులకు అవసంమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులకు నిధుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఆమోదంతో నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులకు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులను సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు రూ. 6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ. 1,050 కోట్లు, తాజాగా మరో రూ. 1,500 కోట్లు కలిపి మొత్తం రూ. 2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అయితే విడుదలైన నిధుల్లో అధిక భాగం అధికారుల ఖాతాల్లోనే ఉండి, లబ్ధిదారులకు పరిహారం అందక పోవడం ఆందోళనకరమన్నారు. జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిధుల కొరత లేదా ఇతర కారణాలతో చెల్లింపులు నిలిచిపోతే వెంటనే ప్రభుత్వానికి వివరాలు పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. విడుదలైన నిధులను అధికారుల వద్ద నిల్వ ఉంచకుండా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పురోగతిని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేయాలని ఆదేశించారు. ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకరణను ప్రాధాన్యతతో చేపట్టాలని మంత్రి ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి సమస్యలు ఎదురైతే హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అవార్డు జారీ చేసిన తర్వాత కూడా ఎక్కువ కాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అధిక పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ. 3,100 కోట్ల విలువైన పనులను గుర్తించగా, రూ. 2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో అధిక పరిహారం కోరుతున్న కారణంగా ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు.

## లక్కారంలో మెగా హెల్త్ క్యాంప్






**చౌటుప్పల్ : సెప్టెంబర్ 21 వార్తా వేదిక సూర్య:** 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ పురపాలిక లక్కారంలో మెగా హెల్త్ క్యాంప్‌ను సోమవారం నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్య సలహాలు, సూచనలు అందించారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో యునాని మెడికల్ ఆఫీసర్ రోజీ మేరీ, ఫార్మసిస్ట్ సరిత, నేచరోపతి నిపుణురాలు అశ్విని, యోగ ఇన్‌స్ట్రక్టర్స్ ఝాన్సీ, సాత్విక్ లు పాల్గొని ప్రజలకు ఆరోగ్య సంరక్షణ, సహజ వైద్యం, యోగా మరియు ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యునాని వైద్యురాలు రోజీ మేరీ మాట్లాడుతూ, వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందుగానే ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. నిత్య జీవితంలో యోగా, ప్రకృతి ఆధారిత ఆరోగ్య పద్ధతులు, సమతుల్య ఆహారం మరియు క్రమబద్ధమైన జీవనశైలిని పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బిక్కు నాయక్ , గోపాల్ రెడ్డి, నారాయణరావు, నరసింహారెడ్డి మరియు స్థానిక ప్రజలు పాల్గొని వైద్యుల సలహాలు, సూచనలు పొందారు. ప్రజలకు ఆరోగ్య సేవలను అందించేందుకు ఇటువంటి ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## భాజపా ఆధ్వర్యంలో కుంకుమార్చన



**మోత్కూరు, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య);** మోత్కూరు మున్సిపల్ పరిధిలో 7వ,వార్డులోని గణేష్ మండపం వద్ద భాజపా పట్టణ అధ్యక్షురాలు చాడ మంజులారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కుంకుమార్చిన నిర్వహించారు. అన ంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్యామల, నవనిత, ముప్పా అరుణ , ధనమ్మ తుమ్మల జ్యోతి,సామ మమత, ఎలుక రేణుక, బిళ్ళపాటి లావణ్య, మౌనిక, సౌజన్య ,కీర్తి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాలో అన్నదానం




**అడ్డగూడూర్, సెప్టెంబర్ 21 (వార్తా వేదిక సూర్య):** అడ్డగూడూర్ మండల కేంద్రంలోనీ శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకుని వద్ద సోమవారం ధర్మశెట్టి ప్రసన్న సాయికుమార్ దంపతులు కుటుంబ సభ్యులు కలిసి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సొంత ఖర్చులతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి వనజ సైదులు, ఉప సర్పంచ్ వరిగడ్డి లోకేష్, విగ్రహ దాత ఇమ్మడి సంతోష్ సత్యవతి, పరమేష్ గూడెపు, శ్రీ గణేష్ యూత్ సభ్యులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## జై వీర హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



**( యాదాద్రి భువనగిరి బ్యూరో ), సెప్టెంబర్ 21 వార్త వేదిక సూర్య** భువనగిరి పట్టణంలోని హనుమాన్వాడ జై వీర హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని మండపం వద్ద సోమ వారం నాడు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ వ్యాపారవేత్త దిడ్డికాడి నర్సింగరావు, సీనియర్ జర్నలిస్ట్ సొల్లేటి గోవర్ధన్ చారి, మహాలక్ష్మి ధర్మశాల కమిటీ చైర్మన్ మంచి కంటి కృష్ణమూర్తి లు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దిడ్డి కాడి హరినాథ్, వేముల కృష్ణ, నీళ్ల ఆంజనేయులు, దిడ్డి కాడి శ్రీను, గోరింకల శ్రీను,బండి బాలు, బస్వాపురం రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాంత్ రెడ్డికి సన్మానం



**మోటకొండూరు /వార్తావేదిక సూర్య:-** మోటకొండూరుమండల పరిధిలోని నాంచారిపేట గ్రామంలో శ్రీరామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పీసరి శ్రీకాంత్ రెడ్డికి ఘన సన్మానం జరిగింది. గ్రామంలోని యువతను ప్రోత్సహిస్తూ, సామాజిక కార్యక్రమాల్లో ఆయన అందిస్తున్న సహకారానికి గుర్తింపుగా యూత్ సభ్యులు ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెల్లీ మల్లేష్,వార్డు సభ్యులు పైల్ల మహేష్ రెడ్డి శ్రీరామ్ యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు దేవల జగదీష్, ఘనగాని నాగరాజు, గ్రామ పెద్దలు, ఇతర యువకులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

**వలిగొండ సెప్టెంబర్ 21 ( వార్తావేదిక సూర్య ):**





యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ గణేశ్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు చౌటుప్పల్ డివిజన్ పరిధిలోని వివిధ నిమజ్జన కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వలిగొండ మండల పరిధిలోని సంగెం చెరువు, తుమ్మలగూడెం చెరువు, రామన్నపేట మరియు వలిగొండ చెరువుల వద్ద నిమజ్జనానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడి పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు, క్రేన్ నిర్వాహకులు మరియు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన ప్రక్రియ సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన కేంద్రాల వద్ద ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ప్రజలు, గణేశ్ ఉత్సవ కమిటీలు, వివిధ శాఖల అధికారులు మరియు పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. ఈ పర్యటనలో చౌటుప్పల్ డీఎస్పీ శ్రీ మధుసూదన్ రెడ్డి , వలిగొండ మరియు రామన్నపేట పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, సంబంధిత పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బహిష్కృతులతో బీఆర్ఎస్ బల ప్రదర్శన

- టికెట్ కోసమే గొంగిడి సునీత డ్రామాలు!
- గొంగిడి సునీత తీరుపై విరక్తి చెందే ప్రజలు కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను 50 వేల భారీ మెజార్టీతో గెలిపించారు
- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బురదజల్లుతున్నారు
- ప్రెస్ మీట్ లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదగిరి ఫైర్



**మోటకొండూరు, సెప్టెంబర్ 21(వార్త వేధిక సూర్య):-** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు బీఆర్ఎస్ టికెట్ దక్కించుకోవాలనే ఆరాటంతోనే మాజీ విప్ గొంగిడి సునీత రాజకీయ డ్రామాలకు తెరతీశారని ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎప్పుడో బహిష్కరణకు గురైన వారిని పదేపదే పార్టీలో చేర్చుకుంటూ, మాజీ మంత్రి హరీశ్ రావు ముందు తన బలాన్ని నిరూపించుకునేందుకు సునీత తాపత్రయ పడుతున్నారని ఎద్దేవా చేశారు. మోటకొండూరులో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుణి రఘునాథ రాజు అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆరోగ్య, నీటిపారుదల వంటి కీలక శాఖలు చేపట్టిన హరీశ్ రావు ఆలేరు నియోజకవర్గానికి పైసా పని చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నియోజకవర్గంలో కనీసం 5 కిలోమీటర్ల కొత్త బీటీ రోడ్డు వేయలేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని మోసం చేశారని మండిపడ్డారు. గొంగిడి సునీత తీరుపై విరక్తి చెందే ప్రజలు ఎమ్మెల్యే బీర్ల అయి లయ్యను 50 వేల భారీ మెజార్టీతో గెలిపించారని గుర్తుచే శారు. ప్రస్తుతం ఎమ్మెల్యే అయిలయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పై బురదజల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 3,500 ఇళ్లను మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొంతం మోహన్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ లు నెమ్మాని సుబ్రమణ్యం,నమిలే మహేందర్ గౌడ్, ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ లు గంధమల్ల అశోక్, చీర శ్రీశైలం,మాజీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మధార్ గౌడ్,స్థానిక సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్,మాజీ సర్పంచ్ బుగ్గ శ్రీశైలం కానుగు బాలరాజు,పట్టణ అధ్యక్షులు బుగ్గ కొమురయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండ రంగయ్య, బొల్లేపల్లి శ్రీనివాస్, కంకాల ఎలందేర్, జూకంటి మధు, శశిధర్ రెడ్డి, పచ్చిమట్ల మధు, క్యాసగళ్ల చందు, భూమండ్ల ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**రామన్నపేట, సెప్టెంబర్ 21: (వార్తా వేదిక సూర్య)** తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు, నిస్వార్థ ప్రజాసేవకుడు, బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను సోమవారం రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో బాపూజీ చేసిన సేవలను, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో వెల్లంకి పద్మశాలి సంఘం అధ్యక్షుడు మిర్యాల ఉపేందర్, వనం సత్తయ్య, ఈడెం శ్రీనివాస్, కొంగరి గోవర్ధన్, వనం పురుషోత్తం, వనం నరసింహ తదితరులు, బాపూజీ అభిమానులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**వలిగొండ సెప్టెంబర్ 21 ( వార్తా వేదిక సూర్య ):**

వలిగొండ మండల పరిధిలోని టేకుల సోమవారం గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త, మాజీ వార్డ్ మెంబర్ కీర్తి వెంకటేశం పరమ పదించినారు. ఈ సందర్భంగా వారి దశదిన కర్మకు హాజరై బిజెపి వలిగొండ మండల శాఖ కార్యకర్తలు అందరం కలిసి మొత్తం 32 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిషన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు బంధారపు లింగస్వామి, బిజెపి మండల నాయకులు మురళీధర్ రెడ్డి, మల్లారెడ్డి, రంజిత్ రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు బంధారపు రాములు, రామచంద్రు, శ్యామల అనిల్ రెడ్డి, నవీన్ రెడ్డి, పాండు, కొండల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శివకొంతం, పార్టీ వెంకట్ రెడ్డి మొదలగు నాయకులు పాల్గొన్నారు.

## గుర్రాలండిలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**యాదాద్రి భువనగిరి జిల్లా/ వార్త వేదిక సూర్య:-:** బీబీనగర్ మండల పరిధిలోని గుర్రాలండి గ్రామ పంచాయతీ పరిధి కొత్తతండాలో వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జీడీఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి గుర్రాలండి, కొత్తతండా వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరై అన్నప్రసాదం స్వీకరించారు. అందరి సహకారంతో కార్యక్రమం విజయవంతమైందని, ఇందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన గ్రామస్తులు, యువతకు వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు, జీడీఆర్ కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలన



**మోత్కూరు, సెప్టెంబర్ 21 ( వార్త వేదిక సూర్య):** మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువు వద్ద వినాయకులను నిమజ్జనం చేసే ప్రాంతాన్ని , సీసీ కెమెరాలు, లైట్స్ పనితీరును సోమవారం మున్సిపల్ కమిషనర్ గోలుకొండ నర్సయ్య పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాలు ప్రజలు జరుపుకోవాలని సూచించారు. నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈ సందర్భంగా సి.ఐ. వెంకటేశ్వర్లు,మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గుప్తా, కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల నాయకులు గడ్డం సోమ నర్సయ్య, మెంట నగేష్, కురుమిళ్ళ రాములు తదితరులు పాల్గొన్నారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**